# ప్రజా తపన
prajathapana.com
News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక:87 గురువారం 18 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# ఏపీ సర్కార్ కు సుప్రీంలో ఊరట

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**

అమరావతిలోని ఆర్ 5 జోన్‌లో సెంటు స్థలాల పంపిణీకి ఏపీ ప్రభుత్వానికి అడ్డంకులు తొలగిపోయాయి. ప్రభుత్వం చేస్తున్న పట్టాల పంపిణీ విషయంలో తాము జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే అంశంపై విచారణలో ఉన్న పిటిషన్లపై వచ్చే తీర్పుకు లోబడి పట్టాల పంపిణీ ఉంటుందని స్పష్టం చేసింది. సీఆర్డీఏ చట్టాన్ని ఉల్లంఘించి ఆర్ 5 జోన్ ను ఏర్పాటు చేసి సెంటు పట్టాలను పంపిణీ చేస్తున్నారని అమరావతి రైతులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. విచారణలో తాము పేదలకు పట్టాలు పంపిణీ చేసేశామని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. విచారణలో ఉండగా ఎలా సాధ్యమని ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వాదనల తర్వాత సెంటు స్థలాల పంపిణీ విషయంలో జోక్యం చేసుకోబోమన్న సుప్రీంకోర్టు.... భూయాజమాన్య హక్కులు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ ప్రకారం పెట్టుబడులతో వచ్చే ఐటీ కంపెనీల కోసం కేటాయించిన ప్రాంతాన్ని విజయవాడ, గుంటూరు నగరాలకు చెందిన పేదలకు



02

## శుద్ధ తిరుమల సుందర తిరుమల విజయవంతం



అధికారులు, ఉద్యోగులకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి అభినందన

**ప్రజా తపన ,తిరుమల**

తిరుమలను ప్లాస్టిక్ రహిత ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్చేందుకు నిర్వహించిన శుద్ధ తిరుమల సుందర తిరుమల కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు, ఉద్యోగులు, ఇతర విభాగాల సిబ్బంది విజయవంతం చేశారని టీటీడీ ఈవో ఎ వి ధర్మారెడ్డి అభినందించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ విభాగాల్లో పనిచేసేవారు, ఇతరులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి ముందుకు వస్తే వారి సేవలు వినియోగించుకోవాలని ఆరోగ్యాధికారి కి సూచించారు. తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో

02



## సుప్రీం లో అవినాష్ రెడ్డికి దక్కని ఊరట

**ప్రజా తపన ,న్యూఢిల్లీ :**

వివేక హత్య కేసులో ముందస్తు బెయిల్ కోసం ఈసారి సుప్రీం కోర్టును ఆశ్రయించారు వైఎస్ఆర్‌సీపీ ఎంపీ అవినాష్ రెడ్డి. హైకోర్టు వెకేషన్ బెంచ్ తన బెయిల్ పిటిషన్ విచారించేలా ఆదేశాలు ఇవ్వాలని రిక్వస్ట్ పెట్టుకున్నారు. సీజేఐ ముందు దీన్ని ప్రస్తావించాలని భావించారు. మెన్షనింగ్ లిస్ట్ వినకుండానే బ్యాచ్‌ల వారీగా తేదీలను కేటాయిస్తామన్నారు సీజేఐ. దీని విచారణ తేదీని కూడా వెల్లడించలేదు. అత్యవసరం అనుకుంటే రాతపూర్వకంగా అభ్యర్థన ఇవ్వాలని సూచించింది. అప్పుడు అత్యవసరంగా విచారించాలా లేదా అన్నది ఆలోచిస్తామని సీజేఐ ధర్మాసనం తేల్చి చెప్పింది. అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో ఉంది. వేసవి సెలవుల తర్వాత విచారిస్తామని న్యాయస్థానం తేల్చింది. సీబీఐ తన పని తాను చేసుకుపోవచ్చని స్పష్టం చేసింది.

02

# భూమా అఖిల ప్రియను అరెస్ట్ చేసిన పోలీసులు

**ప్రజా తపన ,నంద్యాల:**

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి భూమా అఖిల ప్రియను నంద్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె భర్త భార్గవ్ రామ్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. భూమా అఖిలప్రియ దంపతులను ప్రత్యేక వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంగళవారం రాత్రి టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డిపై.. అఖిల ప్రియ వర్గీయులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. నంద్యాల మండలం కొత్తపల్లి దగ్గర ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడి ఘటనపై నంద్యాల పోలీసులకు ఏవీ సుబ్బారెడ్డి ఫిర్యాదు చేయగా యాక్షన్ తీసుకున్నారు. అఖిలతో పాటు 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

02





## గుండెపోటు అనే జగన్ చెప్పారు

**అమరావతి**

వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లం వాంగ్మూలం నమోదు చేసినట్లు తెలిసింది. “తన చిన్నాన్న వివేకానంద రెడ్డి

02

## ఏపి లో వడగాల్పులు..అల్లాడిపోతున్న జనం



**ప్రజా తపన ,అమరావతి:**

ఏపీలో సూర్యుడి ప్రతాపం అంతాఇంతా కాదు. సూర్యుడి ప్రతాపం, వడగాల్పులు, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 6 గంట నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ప్రజలు

02

# రూ. 25 కోట్లు తక్షణం కట్టండి

**ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం**

**ప్రజా తపన , న్యూఢిల్లీ:**

సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వానికి మరో షాక్ తగిలింది. మూడు ప్రాజెక్టుల నిర్మాణంలో పర్యావరణ అనుమతులు ఉల్లంఘించారని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ విధించిన రూ. వంద కోట్ల జరిమానా , ప్రాజెక్టుల నిర్మాణంపై స్టేను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్ పై ప్రభుత్వ వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రాజెక్టుల నిర్మాణంపై ఇచ్చిన స్టేను తొలగించేందుకు నిరాకరించింది. అయితే రూ. వంద కోట్ల జరిమానా విధించవచ్చా లేదా అన్న దానిపై పరిశీలన చేయనున్నారు. కానీ తక్షణం రూ. పాతిక కోట్లను జమ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వేసవి సెలవుల అనంతరానికి వాయిదా వేసింది. చిత్తూరు జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణంలో అవకతవకలపై గుత్తా గుణశేఖర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్జీటి చెన్నై బెంచ్ తీర్పును వెలువరించింది. ఆవులపల్లి , ముదివీడు, నేతిగుంటపల్లి రిజర్వాయర్ల నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ అనుమతులను సైతం ఎన్జీటీ రద్దు చేసింది. మూడు రిజర్వాయర్లను ఒకే జీవో కింద చేపట్టి తాగునీటి కోసమని ఏపీ ప్రభుత్వం మొదట వాదించింది. పర్యావరణ అనుమతులు తీసుకున్న తరువాత మూడు ప్రాజెక్టులను విడగొట్టి ఆవులపల్లి రిజర్వాయర్‌కి మాత్రమే ఏపీ ప్రభుత్వం పర్యావరణ

02

# ఏపీ సర్కార్ కు సుప్రీంలో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్ల స్థలాల రూపంలో పట్టాలు ఇచ్చేందుకు ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఆర్డీఏ చట్టానికి ప్రభుత్వం సవరణ కూడా చేసింది. తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలు, మంగళగిరి మండలంలోని కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు గ్రామాల పరిధిలో ఉన్న 1,134 ఎకరాలను నివాస ప్రాంతంగా మార్చి ఆర్-5 జోన్‌గా పేర్కొంటూ గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. ఈ గెజిట్‌ను సవాల్ చేస్తూ అమరావతి రైతులు హైకోర్టులో పిటిషన్ వేశారు. అమరావతిలో ఇళ్ల స్థలాల అంశంపై ఏపీ ప్రభుత్వం 2020 ఫిబ్రవరిలో జీవో 107 జారీ చేసింది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీలు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, పెదకాకాని మండలాలకు చెందిన పేదలందరికి ఇళ్లు పథకం పేరుతో.. రాజధాని కోసం సమీకరించిన 1251 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి జీవోను హైకోర్టు సస్పెండ్ చేసింది. జోనల్ రెగ్యులేషన్‌కు ఈ ఉత్తర్వులు విరుద్ధమని.. జోనల్ పరిధిని కుదించడమే అన్నారు. రాజకీయ అజెండాలో భాగంగా రాజధాని ప్రాంతానికి చెందనివారికి అమరావతిలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వం సీఆర్‌డీఏ సవరణ చట్టం(యాక్ట్ 13) తీసుకొచ్చింది వాదిస్తున్నారు. ఇప్పటికే దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం దగ్గర ఉన్నాయి. అయితే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేప్పుడు.. జీవో 107ను సవాల్ చేస్తూ దాఖలైన పాత కేసుకు కలపాలని ప్రభుత్వం కోరిందన్నారు. దీంతో అవన్నీ త్రిసభ్య ధర్మాసనం వద్దకు చేరాయని.. ఇప్పుడు దీనిని అవకాశంగా తీసుకున్న ప్రభుత్వం ప్రస్తుత గెజిట్‌ను జారీ చేసింది అని పిటిషన్‌లో ప్రస్తావించారు. సీఆర్డీఏ స్థానిక ప్రజలు లేవనెత్తిన అభ్యంతరాలను పట్టించుకోలేదని అంటున్నారు. అయితే మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది.. కానీ స్థలాల కేటాయింపు తుది తీర్పునకు లోబడి ఉండాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టులోనూ అమరావతి పిటిషన్లు విచారణలో ఉన్నాయి. వాటిపై విచారణ జూలైలో జరగనుంది. ఈ సందర్భంగా వచ్చే తుది తీర్పును బట్టే అమరావతిలో సెంటు స్థలాలపై యాజమాన్య హక్కులు లబ్దిదారులకు వస్తాయని న్యాయనిపుణులు చెబుతున్నారు.

# సుప్రీం లో అవినాష్ రెడ్డికి దక్కని ఊరట

(మొదటిపేజీ తరువాయి)

అవినాష్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను జూన్ ఐదో తేదీకి ధర్మాసనం వాయిద వేసింది. అప్పుడే ఈ కేసు విచారణ సందర్భంగా వెకేషన్ బెంచ్ కు మార్చుకుంటారా పార్టీలను అడిగిన న్యాయమూర్తి అడిగారు. అయితే ప్రధాన న్యాయమూర్తి ఎదుట మెన్షన్ చేసి అర్జెన్సీ ఉందని చెప్పాలని సూచించారు. ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. దీంతో సీబీఐ తన పని తాను చేసుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. దీనిపై కనీసం రెండు వారాలైనా రిలీఫ్ ఇవ్వాలని.. కస్టోడియల్ ఇంటరాగేషన్‌కు కూడా రెడీ అని అవినాష్ తరపు లాయర్లు వాదించినప్పటికీ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. వేసవి సెలవుల తర్వాతే తదుపరి విచారణ జరగనుందని తేల్చేశారు. ఏప్రిల్ 28న ఈ నిర్ణయం వెలువడినా ఇప్పటి వరకు సీబీఐ కానీ, అవినాష్ రెడ్డి నుంచి రియాక్షన లేదు. అయితే ఈ మధ్య వివేకానంద రెడ్డి కుమార్తె సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డికి గతంలో బెయిల్ రద్దు ఇవ్వడంతో ఆ ఉత్తర్వులలో ఓ షరతును సుప్రీం కోర్టులో సునీతా రెడ్డి సవాలు చేశారు. ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేసిన తెలంగాణ హైకోర్టు జులై 1న మళ్లీ విడుదల చేయాలని సీబీఐ కోర్టుకు ఆదేశాలు ఇచ్చింది. బెయిల్‌ను గంగిరెడ్డి దుర్వినియోగం చేసిన ఉదాహరణలు ఉన్నాయని పిటిషన్ లో చెప్పారు. సాక్షులను కూడా బెదిరించే అవకాశాలు ఉంటాయని వివరించారు. హత్యలు చేసిన వాళ్లు బయట ఉంటే సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని అన్నారు. సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ విచారణకు రానున్న టైంలో సీబీఐ అవినాష్ రెడ్డికి నోటీసులు ఇచ్చింది. మంగళవారం మధ్యాహ్నం విచారణకు రావాలని పిలుపునిచ్చింది. దీంతో ఆయన తనకు షార్ట్ నోటీసు ఇస్తే విచారణకు రాలేనని చెప్పారు. నాలుగు రోజుల గడువు కావాలని కోరారు. అవినాష్ రెడ్డి రాసిన లేఖపై స్పందించిన సీబీఐ మూడు రోజుల గడువు ఇచ్చింది. 19వ తేదీన కచ్చితంగా విచారణకు రావాలని పిలుపునిచ్చింది. ఈ విచారణ ఉన్న తరుణంలో ముందస్తు బెయిల్ ప్రయత్నాలు మరోసారి అవినాష్ ముమ్మరం చేశారు.

# గుండెపోటు అనే జగన్ చెప్పారు

(మొదటిపేజీ తరువాయి)

గుండెపోటుతో మరణించారని ఆరోజు జగన్ మాకు చెప్పారు" అని ఆయన తెలిపినట్లు సమాచారం. 'ఏ సమయంలో చెప్పారు?' అని సీబీఐ అధికారులు ప్రశ్నించగా... 'సమయం నిర్దిష్టంగా గుర్తులేదు. తెల్లవారుజామునే ఇది జరిగింది" అని పేర్కొన్నట్లు సమాచారం. 2019 మార్చి 14వ తేదీ అర్ధరాత్రి తర్వాత (15వ తేదీ) పులివెందులలో వివేకానంద రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. అదే రోజున... తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో జగన్ ఎన్నికల ప్రణాళికపై సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. అందులో... అజేయ కల్లం, జగన్ వ్యక్తిగత కార్యదర్శి కృష్ణమోహన్ రెడ్డి, ప్రస్తుత ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ, మేనిఫెస్టో కమిటీ చైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమావేశంలో ఉండగానే తన సతీమణి భారతి నుంచి ఫోన్ రావడంతో... జగన్ పైఅంతస్తుకు వెళ్లారు. ఆ తర్వాత కిందికి వచ్చి... 'చిన్నాన్న గుండెపోటుతో మరణించారు' అని చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో... జగన్‌తో ఆ సమయంలో సమావేశమైన వారి నుంచి వివరాలు రాబట్టాలని సీబీఐ నిర్ణయించుకుంది. ఇదే క్రమంలోనే ఇటీవల అజేయ కల్లంను పిలిచి, ఆయన వాంగ్మూలం తీసుకున్నట్లు సమాచారం. 'చిన్నాన్న గుండెపోటుతో చనిపోయారు' అని జగన్ తమకు చెప్పినట్లుగా అజేయ కల్లం వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిని సీబీఐ అధికారులు కడప సెంట్రల్ జైలులోని అతిథి గృహంలో ప్రశ్నించారు. తాజాగా అజేయ కల్లం వాంగ్మూలాన్నీ నమోదు చేసుకున్నారు. ఇక మిగిలింది... ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, దువ్వూరి కృష్ణ! అతి త్వరలో వారికీ పిలుపు వచ్చే అవకాశముంది!

# జగన్ తీరుపై మండిపడ్డ పవన్ కళ్యాణ్

**అమరావతి:**

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "పాపం పసివాడు" సినిమా పేరును ప్రస్తావిస్తూ జగన్ తీరుపై మండిపడ్డారు. నిన్న బాపట్ల మత్స్యకార సభలో పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సీఎం విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ జనసేనాని ట్వీట్ చేశారు. తనకు ఏమీ తెలియదు అన్నట్లుగా జగన్మోహన్ రెడ్డి చెప్పే వాటికే... "పాపం పసివాడు" సినిమా తీయాలంటూ పవన్ కళ్యాణ్ చురకలంటించారు. ఇంతకీ పవన్ ఏమన్నారంటే..."మన ఏపీ సీఎంతో ఎవరైనా "పాపం పసివాడు" సినిమా తీస్తారని ఆశిస్తున్నాను. అతను చాలా అమాయకుడు. ఇక్కడ ఒక చిన్న మార్పు మాత్రమే అవసరం. అతని చేతిలో 'సూట్‌కేస్'కి బదులుగా, అతని అక్రమ సంపద కోసం మనీలాండరింగ్‌ని సులభతరం చేసే బహుళ 'సూట్‌కేస్ కంపెనీలను' ఉంచండి. ప్రియమైన ఏపీ సీఎం... మీరు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య లేదా కామ్రేడ్ తరిమెల నాగి రెడ్డి కాదు. మీరు అక్రమంగా సంపాదించిన సంపదతో, ప్రజలపై విరుచుకుపడే హింసతో 'వర్గయుద్ధం' అనే పదాన్ని ఉచ్చరించే హక్కు కూడా మీకు లేదు. ఏదో ఒక రోజు 'రాయలసీమ' మీ నుంచి, మీ గుంపు బారి నుంచి విముక్తి పొందుతుందని ఆశిస్తున్నాను. పాపం పసివాడు సినిమా కథనానికి రాజస్థాన్ ఎడారి ఇసుక దిబ్బలు కావాలి, కానీ ఇసుకను ఏపీలో నది ఒడ్డున వైసీపీ దోచుకుంది. కలెక్షన్ పాయింట్లలో తగినంత ఇసుక దిబ్బలు ఉన్నాయి. చీర్స్!!" అంటూ పవన్ ట్వీట్ చేశారు.

### జగన్ చేసిన వ్యాఖ్యలు ఇవే...

నిన్న బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన మత్సకార భరోసా సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకు 175 నియోజకవర్గాలలో బరిలోకి దిగే సత్తా లేదన్నారు. కనీసం 175 స్థానాల్లో చంద్రబాబు పార్టీ రెండో స్థానం కూడా వస్తుందా అని నమ్మకం కూడా చంద్రబాబుకు లేదని తెలిపారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీకి పెట్టలేని వారు ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. చంద్రబాబు పార్టీ వెంటిలేటర్‌పై ఉందని.. అందుకే దత్తపుత్రుడుని నమ్ముకున్నారన్నారు. ఇదే దత్తపుత్రుడిని జనం ఎమ్మెల్యేగా కూడా పనికిరారని ఓడించారని అన్నారు. "బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్నది వీళ్లే. పెళ్లి చేసుకున్నది వీళ్లే, విడాకులు ఇచ్చేది వాళ్లే.. మళ్లీ పెళ్లి చేసుకున్నది.. మళ్లీ విడాకులు ఇచ్చేది వీళ్లే. చంద్రబాబు కలిసి వెల్దాం అన్నారు. దత్తపుత్రుడు చిత్తం ప్రభు అన్నారు. చంద్రబాబుకు ఏది మంచి జరిగితే అలాగే చేస్తానని దత్తపుత్రుడు చెబుతారు. పోటీ వద్దని చెబితే అలాగే చేస్తాడు. చంద్రబాబు గాజువాక రానంటారు, దత్తపుత్రుడు మంగళగిరిలో పోటీ పెట్టకుండా ఆగుతాడు. చంద్రబాబు చెబితే బీజేపీతో దత్తపుత్రుడు తెగదెంపులు చేసుకుంటారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీల కోసం దత్తపుత్రుడు ఏం చేయటానికైనా వెనకాడరు" అంటూ జగన్ విరుచుకుపడ్డారు.

# శుద్ధ తిరుమల-సుందర తిరుమల విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం ఈవో సీనియర్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమలతో పాటు నడకదారుల్లోని దుకాణదారుల కు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. టాక్సి , ప్రైవేట్ వాహనాలు , ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమలకు వెళ్ళే భక్తులకు ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధంపై అవగాహన కల్పించడానికి పోలీస్,ఆర్టీసీ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు . తిరుమలతో పాటు, ఘాట్ రోడ్లు, నడకదారుల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడకుండా భక్తులకు అవగాహన కల్పించేలా దుకాణ దారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. విరివిగా చెత్త బుట్టలు ఏర్పాటుచేసి వ్యర్థపదార్థాలను అందులోనే వేసేలా అవగాహన కల్పించాలన్నారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాల నిర్మాణ వేగం పెంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమయ్యే యంత్ర పరికరాల సమీకరణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. స్విమ్స్, బర్డ్, చిన్నపిల్లల గుండె చికిత్సలఆసుపత్రిలో రోగులు, సిబ్బంది,డాక్టర్లకు సౌకర్యవంతంగా ఉండేలా కేఫ్టేరియా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేద విశ్వవిద్యాలయంలో కొత్తగా ధ్యాన మందిరం నిర్మించి అక్కడ క్రియ యోగ శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. ఆధునిక జీవన విధానంపై వేద విజ్ఞానం ప్రాముఖ్యతపై ఎస్వీ బీసీ కార్యక్రమాలు రూపొందించాలని శ్రీ ధర్మారెడ్డి చెప్పారు. అలాగే మహర్షులు, గొప్ప వారి సూక్తులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. మ్యాన్ స్క్రిప్ట్ ప్రాజెక్టుకు అవసరమైన మౌళిక వసతులు కల్పించాలన్నారు. తిరుమల అడవుల్లో అకేషియా చెట్ల తొలగింపు పై సమీక్షించారు. జేఈవో లు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎస్వీ బీసీ సిఈవో షణ్ముక్ కుమార్, లా ఆఫీసర్ వీర్రాజు, ఎఫ్ ఎ సిఏవో బాలాజి, చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేష శైలేంద్ర,చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# భూమా అఖిల ప్రియను అరెస్ట్ చేసిన పోలీసులు

(మొదటిపేజీ తరువాయి)

ఇవాళ ఉదయాన్నే ఆళ్లగడ్డలోని అఖిల ప్రియ ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి అరెస్ట్ చేశారు.

### హత్యాయత్నం కేసులు..!

అఖిల ఆదేశాలతోనే ఏవీపై దాడి జరిగిందని అటు నంద్యాల.. ఇటు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఏవీ సుబ్బారెడ్డి, ఆయన వర్గం.. అఖిల ప్రియతో పాటు మరికొందరిపై హత్యయత్నం కేసులు పెట్టారు. దీనిపై స్పందించిన పోలీసులు అసలేం జరిగిందని ఆరాతీసి ఇవాళ ఉదయమే అఖిలను అరెస్ట్ చేశారు. మరోవైపు ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోకుండా ఏవీ సుబ్బారెడ్డి, అఖిల ప్రియ ఇంటి వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కాగా.. అఖిల-ఏవీ వర్గాల మధ్య ఇప్పటికే పలుమార్లు గొడవలు జరిగాయి.

### అసలేం జరిగింది..!?

భూమా నాగిరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి ఇద్దరూ ప్రాణ స్నేహితులు. భూమా బతికున్నంత వరకూ అన్నీ తానై చూసుకున్న ఏవీ.. ఆయన మరణాంతరం ఒక్కసారిగా విబేధాలొచ్చాయి. నాటి నుంచి తాను రాజకీయాల్లోకి రావాలని ఏవీ ప్లాన్ చేసుకున్నారు. అంతేకాదు.. అయితే నంద్యాల, లేకుంటే ఆళ్లగడ్డ నుంచి పోటీచేయాలని ఏవీ ఉవ్విళ్లూరుతున్నారు. ఈ క్రమంలో అఖిల ప్రియ వర్సెస్ ఏవీగా పరిస్థితులు మారిపోయాయి. ఇప్పటి వరకూ ఈ రెండు వర్గాల మధ్య ఎన్నిసార్లు గొడవలు జరిగాయో లెక్కలేదు. ఆ మధ్య ఏవీ సుబ్బారెడ్డిపై అఖిలప్రియ భర్త నేతృత్వంలో హత్యకు ప్లాన్ చేయడాన్ని కూడా కడప జిల్లా పోలీసులు గుర్తించిన కేసులు పెట్టిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుంది. అప్పట్లో ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనమే అయ్యింది. నాటి నుంచి నేటి వరకూ ఈ రెండు వర్గాల వారు ఎక్కడ ఎదురుపడినా కొట్లాటలు.. ఎప్పుడు మీడియా ముందుకొచ్చిన మాటల తూటాలు పేలుతున్నాయి.

రానున్న ఎన్నికల్లో తనకే కచ్చితంగా టికెట్ వస్తుందన్న ధీమాతో సుబ్బారెడ్డి ఉన్నారు. ఈ విషయాన్ని లోకేష్ పాదయాత్ర ద్వారా అందరికీ తెలియజేయాలని భావించిన ఏవీ సుబ్బారెడ్డి తన బలాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఈ క్రమంలో ఎవరు ఎవర్ని రెచ్చగొట్టుకున్నారో.. లేకుంటే పనిగట్టుకుని మరీ ఇలా దాడిచేశారో తెలియట్లేదు కానీ.. పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనపై టీడీపీ అధిష్ఠానం ఎలా రియాక్ట్ అవుతుంది..? అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# రూ. 25 కోట్లు తక్షణం కట్టండి

(మొదటిపేజీ తరువాయి)

అనుమతి తీసుకుంది.

పర్యావరణ అనుమతుల ఫైళ్లను కూడా ప్యాబ్రికేట్ చేశారని ఎన్జీటి ధర్మాసనం మండి పడింది. కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ఎన్జీటి కమిటీ ఏర్పాటు చేసింది. పర్యావరణ ఉల్లంఘనలపై అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర స్థాయి పర్యావరణ మదింపు సంస్థలు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే అంశాన్ని పరిశీలించాలని ఎన్జీటి ఆదేశించింది. పిటిషనర్ గుత్తా గుణశేఖర్ తరపున ఎన్జీటిలో లాయర్ కె. శ్రవణ్ కుమార్ వాదించారు. పర్యావరణ అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న దరఖాస్తుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన కంపెనీ ఫీజు చెల్లించింది. మూడు ప్రాజెక్టులకు కలిపి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులను తీసుకోకుండా మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఉన్న శాఖ అనుమతులు మాత్రమే ఏపీ ప్రభుత్వం తీసుకుంది. దీనిపై ఎన్జీటీ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మూడు ప్రాజెక్టులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి చెందిన కంపెనీలే టెండర్లు దక్కించుకున్నట్లుగా తెలుస్తోంది. ఎన్జీటీ తీర్పు ఇచ్చిన తర్వాత కూడా పనులు జరిగాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు ఎన్జీటీ తీర్పుపై స్టే ఇవ్వడానికి నిరాకరించడంతో ఆ పనులు ఆపేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ఏపి లో వడగాల్పులు..అల్లాడిపోతున్న జనం


(మొదటిపేజీ తరువాయి)

రోడ్డుమీదకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. అత్యవసరమైతే తప్ప జనం రోడ్డుమీదకు రాని పరిస్థితి. ఉదయమే భానుడి భగభగలతో వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. మరోవైపు ఏపీలో ఈరోజు 20 మండలాల్లో వడగాల్పు ప్రభావం ఉందని ఏపీ విపత్తుల నిర్వాహణ సంస్థ వెల్లడించింది. అనకాపల్లి జిల్లా 2, గుంటూరు 2, కాకినాడ 1, ఎన్టీఆర్ 3, పల్నాడు 3, వైఎస్సార్ జిల్లాలో 9 మండలాల్లో వడగాల్పులు ప్రభావం ఉంటుందని, మిగిలిన చోట్ల కూడా ఎండ ప్రభావం ఉండనున్నట్లు పేర్కొంది. వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు విపత్తుల సంస్థ నుంచి హెచ్చరిక సందేశాలు వెలువడుతున్నాయి. మెసేజ్ అందినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రయాణాల్లో ఉన్నవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని విపత్తుల సంస్థ సూచనలు చేసింది.

# వడ దెబ్బకు 13 మంది మృతి

**విజయవాడ:**

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఆంధ్రప్రదేశ్ నిప్పుల కొలిమిలా మారింది. బయటకు అడుగు పెట్టాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వడదెబ్బ బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఏపీలో వడదెబ్బతో 12 మంది మరణించగా. తాజాగా ప్రకాశం జిల్లాలో మరొకరు వడదెబ్బతో మరణించారు. దీంతో ఏపీలో వడదెబ్బతో మరణించిన వారి సంఖ్య 13కి చేరింది. ప్రకాశం జిల్లాలోని కంభం పట్టణంలో వడదెబ్బకు గురై కొండేటి గురవయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. కంభం పట్టణంలో నడిచి వెళ్తూ గురవయ్య అకస్మాత్తుగా కుప్పకూలాడు.



స్థానికులు గురువయ్యను హుటాహుటిన కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువయ్యను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వడదెబ్బ వల్లే గురవయ్య మృతి చెందినట్లు వెల్లడించారు. గురువయ్య బేల్దారిగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దీంతో గురువయ్య కుటుంబంలో విషాదం నెలకొంది. కాగా.. ఎండలతో కోస్తా, రాయలసీమ జిల్లాలు భగ భగ మండిపోతున్నాయి. ప్రకాశం జిల్లా పెద్దారవీడులో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. నెల్లూరులో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపు అన్ని జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు.

# అర్థం కానీ జనసేన వ్యూహాలు

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితిని గుర్తించిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఈ సారి త్రిముఖ పోటీలో జనసేనను బలి ఇవ్వకూడదని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. "శత్రువుకు అవకాశాలివ్వకుండా శత్రువును వ్యతిరేకించే వారితో జతకట్టి ప్రత్యర్థులను మట్టికరిపించడమే వివేకవంతుల విధానం. అందుకు సగౌరవంగా... వచ్చే ఎన్నికల్లో పొత్తులతో పోటీ చేస్తాం.." అని మంగళగిరిలో రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల, డివిజన్ అధ్యక్షుల సమావేశంలో ఆయన మరోసారి ఆంధ్ర ప్రజలకు స్పష్టమైన సంకేతాలు పంపించారు.గతేడాది పార్టీ ఆవిర్భావ సభ నుంచి పవన్ వ్యూహాత్మకంగా, స్థిరత్వంతో కూడిన ఆలోచన శైలితో ముందుకు సాగుతున్నారు. ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో అర్థం చేసుకొని క్షేత్ర స్థాయి పరిస్థితులకు దగ్గరగా ఆయన వ్యవహరిస్తున్నారు. రాబోయే ఎన్నికలకు మానసికంగా జనసేన పార్టీ నాయకులను, క్యాడర్ని సిద్ధం చేస్తున్నారు.కర్ణాటక ఎన్నికల్లో ప్రచారం చేయమని బీజేపీ కోరినా, అక్కడి పరిస్థితులను అంచనా వేసి ఆ మైలను తనకు అంటుకోకుండా పవన్ జాగ్రత్త పడ్డారు. సరిగ్గా కర్ణాటక ఫలితాల ముందురోజే వ్యూహాత్మకంగా పార్టీ మండల, డివిజన్ అధ్యక్షుల సమావేశం నిర్వహించి పార్టీ క్షేత్రస్థాయి నాయకులకు "దిశా-దశా" నిర్ధేశించారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి నుండి నివేదికలు తెప్పించుకుని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసేన పార్టీ బలం, బలహీనతలపై ఒక అంచనాకు వస్తూ దానికనుగుణంగా అడుగులు ముందుకు వేస్తున్నారు.కర్ణాటకలో జేడీ(ఎస్), హైదరాబాద్లో ఎంఐఎం ఫోకస్ చేస్తున్నట్టుగా జనసేన కూడా ముందుగా తనకు పట్టున్న ప్రాంతలపైనే దృష్టి పెట్టాలని నిర్ణయించింది. "గత ఎన్నికల్లో జనసేనకు 7 శాతం వరకు ఓట్లు పడ్డాయని గణాంకాలు చెప్తున్నాయి. ఇప్పుడు జనసేన బలం గణనీయంగా పెరిగింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో, ఉభయ గోదావరిలో, ఉత్తరాంధ్రలో జనసేన ఓట్ల శాతం సుమారు 30 నుంచి 35 శాతం వరకు ఉంటుందని భావిస్తున్నాం. మిగతా ప్రాంతాల్లో కాస్త అటు ఇటుగా 18 శాతంగా ఉంటుంది. ఇదే బలంతో మనం అధికారంలోకి రాగలమా? లేక మరోసారి ఇలాగే మిగిలిపోదామా? అని ఆలోచించుకోవాలి" అంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్రస్థాయి పరిస్థితులను పార్టీ నాయకులకు, క్యాడర్కి స్పష్టంగా వివరించారు.దీన్ని బట్టి చూస్తే, జనసేనాని వచ్చే ఎన్నికల్లో స్ట్రయిక్ రేట్ పెంచుకోవాలని చూస్తున్నారని అర్థమౌతోంది. ఎన్ని సీట్లలో పోటీ చేశామన్నది కాకుండా, పోటీచేసిన సీట్లల్లో ఎన్ని సీట్లు గెలుస్తామన్న దానిపై ఆయన ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఇది జనసేనానిలో వచ్చిన రాజకీయ పరిణితికి నిదర్శనం. ఎక్కువ సీట్లు పోటీచేసి ఓడిపోయేదానికన్నా పోటీచేసిన ప్రతీ సీట్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పట్టుదలతో ఆయనున్నారు. అందులో భాగంగానే ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులపై స్వతంత్ర సంస్థలతో సర్వేలు నిర్వహిస్తూ ఆయా నియోజకవర్గాలపై దృష్టిపెట్టినట్లు స్పష్టమౌతోంది. అందులో భాగంగానే మండల, డివిజన్ స్థాయి అధ్యక్షుల సమావేశంలో 40 అసెంబ్లీ స్థానాల్లో తమకు బలమున్నట్లు ఆయన స్పష్టం చేశారు.జనసేనపార్టీ మండల, డివిజన్ స్థాయి అధ్యక్ష సమావేశంలో జనసేన అధినేత ప్రధాన ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశంకు, బిజెపికి 2019 ఎన్నికలతో పోలిస్తే క్షేత్రస్థాయిలో జనసేనపార్టీ బలపడిందని, ఓట్లశాతం కూడా పెరిగిందని గట్టి సందేశాన్నే వారికి పంపారు. రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా, అరాచక వైఎస్ఆర్సిపి పాలన నుండి రాష్ట్రానికి విముక్తి కలిగించాలనే ఏకైక లక్ష్యంతో పొత్తులకు మొగ్గు చూపుతున్నాం తప్ప అది తమ బలహీనత కాదని, తాను బలహీనుడిని కాదనీ, గత్యంతరం లేక పొత్తు పెట్టుకోవడం లేదనే సందేశాన్ని కూడా ఈ సమావేశం ద్వారా బీజేపీ, టీడీపీలకు పంపించారు. తాము లేకుంటే ఆ పార్టీలకు గత్యంతరం లేదని, ఆత్మగౌరవం విషయంలో తాను రాజీపడబోనని కూడా పరోక్షంగా వారిని హెచ్చరించారు.

# అటకెక్కిన కళ్యాణమస్తు

**తిరుపతి:**

టీటీడీ ప్రారంభించిన కల్యాణమస్తు పథకం ప్రారంభించిన కొద్ది రోజులకే అటకెక్కింది. నిరుపేద కుటుంబాల్లో పెళ్లి భారం కాకూడదని సదుద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో ఉచిత సామూహిక వివాహాల కార్యక్రమం తలపెట్టాలని భావించారు. భారీ ఎత్తున ప్రచారం నిర్వహించారు. చివరి నిమిషంలో విరమించుకోవడంతో భక్తులు ఒక్కసారిగా నిరుత్సాహానికి గురవుతున్నారు. యథావిధిగా కార్యక్రమాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుపేదలకు, సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్న టీటీడీ కల్యాణమస్తు కార్యక్రమాన్ని నిర్వహించకపోవటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో పెళ్లి చేసుకుంటే, దాంపత్య జీవితం సాఫీగా సాగుతుందని కలలుకన్న అనేకమంది జంటలకు టీడీడీ తీసుకున్న నిర్ణయంతో షాక్కు గురవుతున్నారు. నిరుపేద వధూవరులకు బంగారు తాళిబొట్టు ఇచ్చి వివాహం జరిపించేందుకు కల్యాణమస్తు కార్యక్రమాన్ని 2007లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రారంభించింది. ఆ తర్వాత ఈ వివాహ ఉత్సవ కార్యక్రమాన్ని ఆరుసార్లు నిర్వహించారు. ప్రస్తుతం పక్కన పెట్టేయడంతో పెళ్లి చేసుకోవాలనుకుంటున్న జంటలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వైసీపీ ప్రభుత్వం వచ్చాక ధర్మకర్తల మండలిలో చర్చించి కల్యాణమస్తును పునరుద్ధరించాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా ఒక గ్రాం బంగారు మంగళ సూత్రంతో పాటు వెండి మెట్టెలు, వధూవరులతోపాటు వచ్చే 20 మందికి భోజనాలు, ఇతర ఖర్చులన్నీ కలిపి జంటకు రూ.32,232 వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని 2020 నవంబరులో తీర్మానించారు. మరలా 2021 ఫిబ్రవరిలో జరిగిన సమావేశంలో చర్చించి ఒక్కో జంటకు రెండు గ్రాముల బంగారు మంగళసూత్రాలు అందించేందుకు టీడీడీ వద్దనున్న 20 వేల మంగళసూత్రాలను వినియోగించుకునేందుకు ఆమోదించారు. గత ఏడాది ఆగస్టు ఏడో తేదీన సామూహిక వివాహాలు జరపాలని నిర్ణయించారు. ముహూర్త పత్రికను శ్రీవారి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు.అర్హులైన వధూవరులు తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తు పత్రాలను పెద్ద ఎత్తున సమర్పించారు. ఆ తర్వాత టీటీడీ అధికారులు కల్యాణమస్తు ఊసే మరిచారు. యువ జంటల ఆశలు అడియాశలయ్యాయి. వస్తున్న వినతుల దృష్ట్యా అయినా తిరిగి కార్యక్రమాన్ని ప్రారంభించాలని దరఖాస్తు చేసుకున్నవారు కోరుతున్నారు

# కడియం నర్సరీలకు వేసవి తాపం

**కడియం**

ప్రచండ భానుడు ప్రతాపానికి దేశ వ్యాప్త ప్రసిద్ధిచెందిన కడియం నర్సరీలు అల్లాడిపోతున్నాయి. మంగళవారం రికార్డు స్థాయిలో ఈ ప్రాంతంలో 49 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. దీంతో కొన్ని మొక్కలు ఒక్కసారిగా వేడికి తలలు వాలే సాయి. వీటిని సంరక్షించుకోవడం నర్సరీ రైతులకు పెను సవాలుగా మారింది. గ్రీన్ బెల్ట్ గా ప్రసిద్ధిగాంచిన ఈ కడియం నర్సరీలు గ్రీష్మ తాపానికి కళాహీనంగా మారుతున్నాయి.కడియం మండలంతో పాటు ఆలమూరు, మండపేట, రంగంపేట తదితర మండలాలలో వేలాది ఎకరాలలో మొక్కల పెంపకం జరుగుతుంది.ప్రతి వేసవికి తప్పని పాట్లుమన ఇంట్లో పెంచుకునే పదోపరకో మొక్కలను వేసవిలో సంరక్షించుకోవడానికి ఆపసోపాలు పడిపోతుంటాము. ఎప్పటికప్పుడు నీరు అందిస్తూ వాటిని ఎంత జాగ్రత్తగా చూసుకున్నా వేడికి తట్టుకోలేక కొన్ని మొక్కలు చనిపోతుంటాయి.మరి అలాంటిది ఒక్కొక్క నర్సరీలో లక్షలాది మొక్కలు వివిధ వయస్సులలో ఉంటాయి. వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవడం ఎంత కష్టమో ఆ మొక్కలను పెంచి పోషించే రైతులకే తెలుస్తుంది. నిద్రాహారాలు మాని ఈ మొక్కలను బతికించుకోవాల్సి ఉంటుంది. ఇది ప్రతి వేసవిలోనూ రైతుల ఎదుర్కొనే ప్రధాన సమస్య. సాధారణంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని తయారైన మొక్కలను మార్చి నెలకే అమ్మకాలు పూర్తి చేస్తారు.అయితే ఈ ఏడాది అంతంతమాత్రంగానే ఎగుమతులు జరగడం వల్ల మొక్కల నిల్వలు ఎక్కువగానే ఉన్నాయని చెప్పుకోవచ్చు. ఇప్పుడు వాటిని బతికించుకోవడం ప్రతి రైతుకు సవాలుగానే మారుతుంది. ఓ పక్క విద్యుత్ కోతలు, మరో పక్క



మండే ఎండలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదికాక ఈ వేసవి కూలీలు కూడా పనికి రావడానికి అంతగా మొగ్గుచూపరు. ఉదయం పూట మాత్రమే చాలామంది కూలీలు పనికి వస్తున్నారు. ఇలాంటి సమయంలో రెండు పూటలా ఈ మొక్కలకు నీరు అందించడం ఎంత కష్టమో వేరే చెప్పనవసరం లేదు. మొక్కకు మొక్కే తోడు... ముల్లును ముల్లుతోనే తీయాలనే పాత సామెత మనందరికీ గుర్తుండే ఉంటుంది. అయితే అలాంటి సామెత మాదిరిగానే నర్సరీ రైతులు కూడా ఈ వేసవి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంటారు. అది ఎలాగంటే ఖరీదైన నర్సరీ మొక్కలకు వేసవితాపం తగలకుండా వేరే మొక్కలను పెంచుతుంటారు. అవి కేవలం నీడని ఇవ్వడం తప్ప ఎందుకు పనికిరావు. అలాంటి అవిశ మొక్కలను వేసవికి ముందే నాటుతారు. అవి వేసవి సమయానికి ఏపుగా ఎదిగి కింద ఉండే మొక్కలకు నీడనిస్తాయి. ఆ నీడలో ఎండలను తట్టుకుని ఈ మొక్కలు జీవిస్తాయి. మొక్కలకు ఎంత నీరు అందించినా భగభగ మండే ఎండలను తట్టుకోలేవు. అందుకుని ఈ నీడనిచ్చే అవిశ మొక్కలను ముందు జాగ్రత్తగా రైతులు రంగంలోకి దింపుతారు. ఎండకాలం వెళ్లిపోయిన వెంటనే ఈ నీడనిచ్చే మొక్కలను తొలగిస్తారు. ఎప్పుడు కడియం నర్సరీలకు వెళ్ళినా కొత్త కొత్త అందాలతో అద్భుతంగా కనిపించే ఈ మొక్కలు ఇప్పుడు వెళ్తే కనబడవు.నీడనిచ్చే మొక్కల మధ్య బతుకుజీవుడా అంటూ కాలం గడుపుతాయి.తన అందచందాలతో మిడిసిపడే మొక్కలు ఎండవేడిని తాళలేక నీడనిచ్చే మొక్కల కింద తలదాచుకుంటాయి. ఇండోర్ మొక్కలకు ప్రత్యేక ఏర్పాట్లుఎంతో సున్నితంగా ఉండే ఇండోర్ మొక్కలకు ఈ వేసవిలో ప్రత్యేక ఏర్పాట్లు చేయక తప్పదు. ఈ మొక్కల కోసం లక్షలాది రూపాయల వ్యయంతో ఫాలీ హౌసులు, సెమీ షేడ్ నెట్ లను ఏర్పాటు చేస్తుంటారు. ఆ మొక్కలు నీడలోనే జీవించగలవు. అందుకనే గతంలో నాలుగైదు పెద్ద నర్సరీలలో మాత్రమే ఉండే ఈ ఫాలి హౌసులు ఇప్పుడు పదుల సంఖ్యలో పెరిగాయి. ఎండకు వేడిగాలులకు ఇవి ఎంతో రక్షణ కల్పిస్తాయి. అలంకరణకు వినియోగించే ఇండోర్ మొక్కల కొనుగోలు ఇటీవల పెరగడంతో నర్సరీ రైతులు కూడా వీటిని అధిక మొత్తంలో అందుబాటులో ఉంచుతున్నారు. దేశ విదేశాల నుంచి తీసుకొచ్చిన ఈ మొక్కలు కు వేసవి వేడి తగలకుండా రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపెడతారు. ఎగుమతులు, దిగుమతులకు కష్టమే నేల మీద ఉండే మొక్కలను సంరక్షించుకోవడమే వేసవిలో కష్టమవుతుంది. అలాంటిది ఇతర రాష్ట్రాల నుంచి మొక్కలు దిగుమతి చేసుకోవడం లేదా ఎగుమతి చేయడం ఎంత కష్టమో వేరే చెప్పనవసరం లేదు. సాధారణ రోజుల్లో లారీలపై చేసే లోడింగ్ మాదిరిగా కాకుండా ఎండ వేడి తగలకుండా ఆ మొక్కలపై అరటి సొరుగు ఇతర ఏర్పాట్లను రైతులు చేస్తుంటారు. ఎందుకంటే ఇలాంటి ఎండల్లో ఈ మొక్కలకు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎగుమతి చేస్తే అక్కడికి వెళ్ళేసరికి వాటి రూపురేఖలు మారిపోతాయి. అందుకునే తగినన్న జాగ్రత్తలతో మొక్కల ఎగుమతులు చేస్తారు.

# భారత్ జోడో యాత్ర సెకండ్ ఫేజ్

**న్యూఢిల్లీ :**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర రెండో విడత ప్రారంభించేందుకు కర్ణాటక ఎన్నికల ఫలితాలు మంచి బూస్ట్ ఇచ్చినట్లుగా భావిస్తున్నారు. భారత్ జోడో యాత్ర రెండో విడత ఉంటుందని ఇంతకు ముందే కాంగ్రెస్ సంకేతాలిచ్చింది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు రాహుల్ గాంధీ, ఇతర నాయకులు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన దాదాపు 4,000 కిలోమీటర్ల ప్రయాణం తరువాత.. మరో యాత్ర కోసం పార్టీ శ్రేణుల్లో చాలా ఉత్సాహం, శక్తి ఉందని చత్తీస్ ఘడ్లో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశాల సమయంలో చెప్పారు.

ఈ సారి ఈస్ట్-టు-వెస్ట్ యాత్ర ఉంటుందని.. బహుశా అరుణాచల్ ప్రదేశ్ లోని పసిఘాట్ నుంచి గుజరాత్ లోని పోర్బందర్ వరకు సాగే అవకాశం ఉందని ఫిబ్రవరిలో కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ తెలిపారు. రెండో విడత యాత్ర ఆకృతి భారత్ జోడో యాత్ర తొలి విడతతో పోలిస్తే కొంచెం భిన్నంగా ఉంటుందని చెప్పారు. ఈ మార్గంలో నదులు, ఆరణ్యాలు ఎక్కువగా ఉన్నందున సవాళ్లతో కూడి ఉంటుందని ఆలోచిస్తున్నారు. జూన్ నుండి వర్షాలు, నవంబర్లో మళ్ళీ రాష్ట్ర ఎన్నికలు ఉన్న నేపథ్యంలో.. యాత్ర జూన్ కంటే ముందు గానీ, నవంబర్ కంటే ముందు గానీ చేపట్టాలన్న ప్రణాళికలు వేశారు. ఈ యాత్ర.. తొలి విడత కన్నా తక్కువ సమయంలోనే పూర్తయ్యే అవకాశం ఉంది. రాహుల్ గాంధీ నేతృత్వంలో నెలల పాటు సాగిన భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నంచి కశ్మీర్ వరకూ చేశారు. అక్కడ సభ నిర్వహించి ఆ యాత్రకు ముగింపు పలికింది కాంగ్రెస్. ఈ జర్నీలో తాను ఎన్నో నేర్చుకున్నట్టు చెప్పారు రాహుల్ గాంధీ చాలా సార్లు చెప్పారు. అంతే కాదు. ఇది గ్రాండ్ సక్సెస్ అయిందనీ వెల్లడించారు. పాదయాత్ర పార్టీ కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహం వచ్చిందని.. . అందుకే మరోసారి ఇలాంటి యాత్ర కొనసాగించాలని భావిస్తున్నామని కాంగ్రెస్ చెబుతోంది. భారత్ జోడో యాత్రను తపస్సుతో పోలుస్తున్నారు రాహుల్ గాంధీ. భారత్ జోడో యాత్రలో కర్ణాటకలో తిరిగిన నియోజకవర్గాల్లో ఎక్కువ చోట్ల కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో భారత్ జోడో యాత్ర ఫలితాలు ఇస్తోందని కాంగ్రెస్ పార్టీ నేతలు నమ్ముతున్నారు. అందుకే అనుకున్న విధంగా రెండో విడత జోడోయాత్ర నిర్వహించాలన్న అభిప్రాయానికి ఎక్కువ మంది వస్తున్నారు. విజయం ఉత్సాహం ...మరోసారి రాహుల్ ను పాదయాత్ర వైపు మళ్లించే అవకాశం ఉంది.

# వచ్చే నెలలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు వచ్చే నెలలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జూన్ 8,9,10 తేదీలలో అన్ని జిల్లా కేంద్రాలలో మృగశిర కార్తె ను పురస్కరించుకొని నిర్వహించనున్న ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణ, ఏర్పాట్లపై పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఆధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా లతో కలిసి మత్స్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా నూతనంగా మత్స్య సహకార సంఘాల సొసైటీ చైర్మన్ గా నియమితులైన పిట్టల రవీందర్ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం 10 వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో జూన్ 2 వ తేదీ నుండి 21 రోజులపాటు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని వివరించారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ను అత్యంత ఘనంగా నిర్వహించేలా అనువైన ప్రాంతాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ లో చేపలతో తయారు చేసిన ఫిష్ ఫ్రై, కర్రీ, బిర్యానీ వంటి అన్ని రకాల వంటకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్వయం ఉపాది పొందే విధంగా అన్ని జిల్లాలకు చెందిన మహిళా మత్స్యకారులకు చేపల తో వివిధ రకాల వంటకాల తయారీ పై ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరిగిందని, వారి భాగస్వామ్యంతో ప్రతి జిల్లా కేంద్రంలో నిర్వహించే ఫెస్టివల్ లో 20 నుండి 30 వరకు వివిధ రకాల చేప వంటకాల స్టాల్స్ ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి చోట విజయ డెయిరీ ఉత్పత్తులతో కూడిన స్టాల్ ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభానికి ఆయా జిల్లాలకు చెందిన మంత్రి వర్యులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఫెస్టివల్ కు వచ్చే వినియోగదారులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. రాష్ట్ర పండుగను తలపించే విధంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ అధికారులతో పాటు గోపాలమిత్ర లకు కూడా భాగస్వాములను చేయాలని అన్నారు. అదేవిధంగా మత్స్యరంగానికి విశేష సేవలు అందించిన వారిని గుర్తించి సన్మానించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచితంగా చేపపిల్లల పంపిణీ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో మత్స్య సంపద గణనీయంగా పెరిగిందని, మత్స్యకారులు నిరంతరం చేపల వేటను కొనసాగిస్తూ జీవనోపాధిని పొందుతున్నారని అన్నారు. నూతనంగా లక్ష మందికి మత్స్య సొసైటీ లలో సభ్యత్వాలు కల్పించే విధంగా స్పెషల్ డ్రైవ్ ను నిర్వహిస్తున్న విషయాన్ని కూడా మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలోని మత్స్యకారులు ఎంతో సంతోషంగా ఉన్నారని వివరించారు.

# పారాయణాలతో సమాజంలో ధార్మిక విలువలు పెంపు

## - కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి మహాస్వామి

**తిరుమల**

రామాయణం, మహాభారతం లాంటి ఇతిహాసాల పారాయణం వల్ల సమాజంలో ధార్మిక విలువలు పెంపొందుతాయని, ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు చేపడుతున్న టిటిడిని అభినందిస్తున్నానని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఉద్ఘాటించారు. తిరుమల నాదనీరాజనం వేదికపై బుధవారం జరిగిన అయోధ్యకాండ పారాయణం ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిటిడి ఈవో శ్రీ ఎవి.ధర్మారెడ్డితో కలిసి స్వామిజీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ఇతిహాసాలు మానవ జాతి ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి శాశ్వత మార్గదర్శకాలన్నారు. కోవిడ్ మహమ్మారి నుండి మానవాళిని రక్షించాలని శ్రీవారిని ప్రార్థిస్తూ పారాయణ యజ్ఞాన్ని ప్రారంభించి మూడు సంవత్సరాలుగా టిటిడి విజయవంతంగా నిర్వహిస్తోందని కొనియాడారు. పారాయణాల ద్వారా ఇతిహాసాల సారాన్ని ప్రపంచానికి అందించాలని ఈవో శ్రీ ఎవి ధర్మారెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. రామాయణం లోని పాత్రలు ఆదర్శనీయంగా నిలుస్తాయని, తండ్రి ప్రేమకు చిహ్నంగా దశరథుడు, శ్రీరాముడు తండ్రి మాటను శిరసావహించే కుమారుడిగా, సీత బాధ్యతాయుతమైన భార్యగా, లక్ష్మణుడు, భరతులు సోదరప్రేమకు ప్రతీకగా, హనుమంతుడిని గొప్ప సేవకునిగా అభివర్ణించారు. రామాయణ, మహాభారతాలు అనేక యుగాల తర్వాత కూడా అజరామరంగా ఉండటానికి ఇదే కారణమన్నారు. ముందుగా ఈవో శ్రీ ఎ.వి.ధర్మా రెడ్డి మాట్లాడుతూ సుందరకాండ, బాలకాండను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత 4 వేలకుపైగా శ్లోకాలు గల అయోధ్యాకాండను ప్రారంభించామన్నారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీ రాణి సదాశివమూర్తి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు శ్రీ కుప్పా విశ్వనాథ శర్మ, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ శ్రీ కేఎస్ఎస్.అవధాని తదితరులు మాట్లాడారు. పారాయణం ప్రారంభానికి ముందు, టిటిడి ఆస్థాన విద్వాంసులు డాక్టర్ గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ బృందం "శరణు శరణు నీకు .. జగదేక వందిత" అన్నమాచార్య సంకీర్తనను రాగయుక్తంగా ఆలపించారు. ధర్మగిరికి చెందిన ప్రఖ్యాత పండితులు రామానుజాచార్యులు ప్రతి శ్లోకం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తారు. అనంత వేణుగోపాల్ శ్లోక పారాయణం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కోసం ప్రతిరోజూ ఉదయం 7 నుండి 8 గంటల మధ్య ఎస్వీబీసీ ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

# సంచార్ సాథీతో మొబైల్ నేరాలకు చెక్

**ముంబై :**

ఆధార్ కార్డులు వచ్చినప్పటి నుండి ఏ పనికైనా ఆధార్ తప్పనిసరిగా మారిపోయింది. ఈ ఒక్క కార్డు లేకపోతే ఏ పనీ జరగడం లేదు. ఇందులో కొంత వెసులుబాటు ఉన్నా.. సమస్యలు కూడా అన్నే ఉన్నాయి. మన ఆధార్ జిరాక్స్ వేరే వారి చేతికి వెళ్తే మన సమాచారం అంతా వారి చేతుల్లోకి వెళ్లినట్లే. దాంతో సిమ్ కార్డులు తీసుకుని వాటితో ఆన్ లైన్ నేరాలు చేస్తున్న ఘటనలు రోజూ వార్తల్లో వస్తూనే ఉన్నాయి. ఏదైనా నేరం జరిగి పోలీసులు మన ఇంటికి వచ్చే వరకు కూడా మన పేరుపై ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో తెలుసుకోలేని పరిస్థితి. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర సర్కారు తాజాగా సంచార్ సాథీ అనే పోర్టల్ ను ప్రారంభించింది. మొబైల్ ఫోన్ల ద్వారా జరిగే నేరాలను అరికట్టడమే ముఖ్య ఉద్దేశంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్విని వైష్ణవ్ సంచార్ సాథీ పోర్టల్ ను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు.తాజాగా ప్రారంభమైన సంచార్ సాథీ పోర్టల్ ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నట్లు కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అలాగే మొబైల్ ఫోన్ల ద్వారా జరిగే నేరాలను అరికట్టడానికి సంచార్ సాథీ పోర్టల్ ను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా ఒకరి పేరుపై ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ మధ్యే తీసుకువచ్చిన సీఈఐఆర్ వెబ్ సైట్ కూడా సంచార్ సాథీ పోర్టల్ లో మొదటి అడుగుగా అభివర్ణించారు కేంద్రమంత్రి. ఫోన్ పోయినప్పుడు ఆ ఫోన్ లోని సమాచారాన్ని ఎవరూ చూడకుండా దానిని సంచార్ సాథీ పోర్టల్ ద్వారా బ్లాక్ చేయవచ్చని వెల్లడించారు. డిజిటల్ ఐడెంటిటీ కోల్పోకుండా చూడటం ఒక అంశంగా పేర్కొన్నారు. నో యువర్ మొబైల్ అనే రెండో ఫీచర్ గురించి వివరించారు.ఆధార్ కార్డు ఉంటే సిమ్ తీసుకోవడం చాలా సులభం. అయితే ఒకరి పేరుపై ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో.. వాటిని ఎక్కడెక్కడ తీసుకున్నారో సంచార్ సాథీ పోర్టల్ ద్వారా తెలుసుకునే వీలు కల్పించారు. వ్యక్తులకు తెలియకుండా వారి పేరుపై ఉన్న సిమ్ లను ఈ పోర్టల్ ద్వారా తొలగించే అవకాశం ఉంది. ఆధార్ కార్డు నంబరు సాయంతో నకిలీల గురించి తెలుసుకోవచ్చు. దొంగిలించిన ఫోన్ లొకేషన్ కనుక్కోవడంతో పాటు లీగల్ విధానంలో ఒక ఫోన్ ను పని చేయకుండా చేయవచ్చు. ప్రముఖ బ్రాండ్లకు చెందిన ఫోన్లకు డిటోగా ఉండే క్లోన్ ఫోన్లు మార్కెట్లో తక్కువ ధరలోనే అందుబాటులో ఉంటాయి. వీటిని ఒరిజినల్ ఫోన్ గా భ్రమింపజేసే అమ్మే వారు కూడా ఉంటారు. అలాంటి పరిస్థితిలో అది నిజమైనదో కాదో తెలుసుకోవడానికి సంచార్ సాథీ పోర్టల్ ఉపయోగపడుతుంది. ఫోన్ ఐఎంఈఐ నంబరు సాయంతో ఆ ఫోను నిజమైనదా, నకిలీదా సులభంగా తెలుసుకోవచ్చు. '87 కోట్ల మొబైల్ ఫోన్లపై కనెక్షన్లను పరిశీలిస్తే.. అందులో 42 లక్షల కనెక్షన్లు నకిలీవిగా తేలింది. అందులో 36 లక్షల కనెక్షన్లను రద్దు చేశాం. మూడు విధాలైన సంస్కరణలతో సంచారా సాథీ పోర్టల్ తీసుకొచ్చాం. భారత టెలికాం సెక్టార్ ను గ్లోబల్ లీడర్ గా చేయడమే మా లక్ష్యం' అని కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పుకొచ్చారు.

# చిరు ఉద్యోగులపైనే ప్రతాపం...?

**హైదరాబాద్ :**

జీహెచ్ఎంసీలో ఉద్యోగులు, కార్మికులకు సంబంధించి వేర్వేరు చట్టాలు అమలవుతున్నాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని రకాల ప్రయోజనాలున్నా పర్మినెంట్ ఉద్యోగులకు వర్తించని బయోమెట్రిక్ విధానం ఎలాంటి జాబ్ సెక్యూరిటీ లేని, చాలీచాలని జీతాలున్న తమకు అమలు చేయటంపై ఔట్‌సోర్స్ ఉద్యోగులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. నెలకు లక్షల్లో జీతాలు, రోజువారీ, నెలసరి మామూళ్లతో చేయాల్సిన పనిని కూడా పక్కనబెట్టి, అవసరమైతే ఆ పని కూడా ఔట్‌సోర్స్ ఉద్యోగులతో చేయించే పర్మినెంట్ ఉద్యోగులకెందుకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయరంటూ పలు యూనియన్లు ప్రశ్నిస్తున్నాయి. జీహెచ్ఎంసీలో ప్రస్తుతం పర్మినెంట్, ఔట్‌సోర్స్, కాంట్రాక్టు ప్రాతిపదికన సుమారు 28 వేల పైచిలుకు ఉద్యోగులుండగా, వీరిలో సుమారు 18 వేల 352 మంది శానిటేషన్ సంబంధించిన వర్కర్లున్నారు. మిగిలిన పదివేల మందిలో దాదాపు మూడున్నర వేల మంది పర్మినెంట్ ఉద్యోగులుండగా, మిగిలిన ఆరున్నర వేల మందిలో వెటర్నరీ, ఎంటమాలజీ తదితర విభాగాలకు చెందిన ఔట్‌సోర్స్ కార్మికులున్నారు. మొత్తంలో ఉద్యోగుల్లో దాదాపు సుమారు 24 వేల మంది ఔట్‌సోర్స్ ఉద్యోగులకు విధి నిర్వహణలో పారదర్శకత, సమయపాలన పాటించేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. చాలీచాలని జీతాలు, అపరిమితమైన పని గంటలున్నాయి.పైగా వీరందరికి నెల మొత్తం పని చేసినట్లు విభాగాధిపతి జారీ చేసే సర్టిఫికెట్ సమర్పిస్తేనే జీతాలు చెల్లిస్తున్నారు. సుమారు మూడున్నర వేల మంది పర్మినెంట్ ఉద్యోగులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయకపోవటంతో వారంతా తమకిష్టమొచ్చినపుడల్లా విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలున్నాయి. వారి పైఅధికారులు ప్రశ్నిస్తే యూనియన్లకు ఫిర్యాదులు చేసి, వారిచే అధికారులను బెదిరిస్తున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. ఉద్యోగుల్లో లక్షల్లో జీతాలు తీసుకుంటున్న వారికి సమయపాలన, విధి నిర్వహణలో పారదర్శకతకు సంబంధించి ఎలాంటి నిబంధనల్లేవు. కానీ రూ.10 వేల నుంచి రూ.25 వేలలోపు జీతాలు తీసుకుంటున్న చిరుద్యోగులపై నిబంధనలను అమలు చేయటం కేవలం అధికారులు తమ ఉనికిని చాటుకునేందుకేనన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం మూడున్నర వేలకు పడిపోయిన పర్మినెంట్ ఉద్యోగుల్లో కనీసం సగంమందైనా విధులకు హాజరుకావటం లేదని తెలిసింది. వీరిలో దాదాపు వెయ్యి నుంచి 1500 మంది పర్మినెంట్ ఉద్యోగులు వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి, వారికి సేవ చేస్తున్నామని చెప్పుకుంటూ వారి పనులు వారు చేసుకుపోతున్నారు.ఇక మిగిలిన మరో సగం మందిలో చాలా మంది నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తమ పై అధికారులకు, సూపర్ వైజర్లకు లంచాలిచ్చి అటెండెన్స్‌లు వేయించుకుని జీతాలు పైసా తగ్గకుండా డ్రా చేసుకుంటున్నట్లు సమాచారం. విధి నిర్వహణలో వారికి సమయపాలన, పారదర్శకత లేకపోవటం వల్లే అడ్డదారిలో జీతాలు అందుతూ, అవినీతి పెరిగిపోతుందని కొందరు అధికారులే బహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు.తాము ప్రశ్నిస్తే యూనియన్లతో ఒత్తిళ్లు వస్తున్నాయంటూ వాపోతున్నారు. జీహెచ్ఎంసీలో ఇప్పటికే సుమారు 24 వేల పైచిలుకు ఔట్‌సోర్స్ కార్మికులకు అమలు చేస్తున్న బయోమెట్రిక్ విధానాన్ని మూడున్నర వేల మంది పర్మినెంట్ ఉద్యోగులకు అధికారులెందుకు అమలు చేయటం లేదు? దీని వెనకా రాజకీయం ఏమిటీ? అంటూ పలువురు ఔట్‌సోర్స్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. వారికి కూడా బయో మెట్రిక్ విధానాన్ని వర్తింపజేస్తే వారి పనితీరులో పారదర్శకత, జవాబు దారితనం పెరుగుతుందన్న వాదనలు న్నాయి

# రెండు ఎమ్మెల్సీలు-భారీగా ఆశవహులు

**హైదరాబాద్ :**

బీఆర్ఎస్ పార్టీకి చెందిన గవర్నర్ కోటాలో ఎన్నికైన ఇద్దరు ఎమ్మెల్సీల పదవీ కాలం ఈ నెల 27తో ముగియనుంది. వీరి స్థానంలో ఎవరిని ఎంపిక చేయాలనేదానిపై పార్టీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి అడుగులు వేస్తోంది. మండలిలో ఇప్పటివరకు ఏ కులానికి ప్రాతినిధ్యం లేదు, ఎవరికి ఇస్తే రాబోయే ఎన్నికల్లో ప్లస్ అవుతుంది, ప్రభుత్వంపై విమర్శలు రాకుండా, ఆయా వర్గాలు దూరం కాకుండా ఉండేందుకు ఇప్పటికే పలువురి పేర్లను పరిశీలించినట్లు సమాచారం. ఖాళీ అయ్యే రెండు ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థులు మైనార్టీలే కావడంతో తిరిగి వారినే ఎంపిక చేయాలా? లేకుంటే అదే వర్గానికి చెందిన ఇతరులను ఎంపిక చేయాలా అన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. డి.రాజేశ్వర్ రావు(క్రైస్తవ), ఫరూక్ హుస్సేన్ (ముస్లిం) ఇద్దరూ మైనార్టీకి చెందినవారే. వీరు ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. వీరికిమూడోసారి అవకాశం కల్పిస్తారా లేదా అనేది పార్టీలో చర్చనీయాంశమైంది .మాజీ ఎమ్మెల్సీ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ టీఎస్ పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, మాజీ మంత్రి నర్సింహులు, నాయకులు అరికల నర్సారెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులతో పాటు చకిలం అనిల్ కుమార్, చాడ కిషన్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, కర్నె ప్రభాకర్, రాపోలు ఆనంద భాస్కర్, దాసోజు శ్రవణ్ కుమార్ పేర్లను పరిశీలించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన నవీన్ కుమార్, గంగాధర్ గౌడ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీ కాలం ముగిసింది. తిరిగి నవీన్ కుమార్‌కు గులాబీ బాస్ రెన్యూవల్ చేయగా, దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రాంరెడ్డిలకు అవకాశం కల్పించారు. ముగ్గురు ఓసీలే కావడం గమనార్హం. బీసీలకు చెందినవారికి అవకాశం కల్పిస్తారని ప్రచారం జరిగినా కేసీఆర్ మాత్రం మొండిచెయ్యి చూపారు. మండలిలో 40 మంది సభ్యులు ఉన్నా బీసీల్లోని గౌడ కులస్తులకు ప్రాతినిధ్యం లేదు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో గంగాధర్ గౌడ్ పేరు బలంగా వినిపిస్తోంది.గత అనుభవం పునరావృతం కాకుండా గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా పాడి కౌశిక్ రెడ్డిని కేబినెట్ ఏకగ్రీవ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపినప్పటికీ ఆమోదించలేదు. కేసులు ఉన్నాయనే సాకుతో మూడునెలలకు పైగా పెండింగ్‌లో పెట్టడంతో తిరిగి ఆయన స్థానంలో మధుసూదనాచారికి అవకాశం కల్పించారు. ఎన్నికలకు ముందు అలాంటివి పునరావృతం కాకుండా కేసీఆర్ అభ్యర్థుల ఎంపికలో పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు.

# నల్గొండ బరిలో గుత్తా వారసుడు..?

**నల్గొండ :**

ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన... శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుంఖేందర్ రెడ్డి తన వారసుడు గుత్తా అమిత్ రెడ్డిని రాజకీయాల్లోకి తీసుకొచ్చేందుకు చక్రం తిప్పుతున్నారు. పార్టీ లైన్ దాటకుండా తన కుమారుడు కూడా రేసులో ఉన్నాడనే హింట్ ఇస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గుత్తా అమిత్ రెడ్డిని పోటీలో నిలిపేందుకు పావులు కదుపుతున్నారు. రాజకీయ వ్యూహంలో భాగంగానే ట్రస్ట్ ఏర్పాటు చేసి ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్గొండ, మునుగోడు నియోజకవర్గాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పెద్దల ఆశీర్వాదం తోనే తన కుమారుడి రాజకీయ ఆరంగ్రేటం చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నారు. విదేశాల్లో చదువుకున్న గుత్తా అమిత్ రెడ్డి వ్యాపారాల్లో రాణించారు. రాజకీయాల్లో ఎంట్రీ ఇచ్చేందుకు మంచి టైమింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. కొన్ని నెలలుగా తన తాత గుత్తా వెంకట్ రెడ్డి పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. నల్గొండ, మునుగోడు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ జనాలతో కనెక్ట్ అవుతున్నారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలను డిస్టర్బ్ చేయకుండా తనపని తాను చేసుకుంటూ సైలెంటుగా నెట్ వర్క్ పెంచుకుంటూ పోతున్నారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్గొండ, మునుగోడు ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఇద్దరిపై సొంతపార్టీలోనే వ్యతిరేకత ఉంది. ఇది గులాబీ బాస్ కేసీఆర్ వరకూ వెళ్లింది. ఇద్దరిని పిలిచి క్లాస్ కూడా పీకినట్టు టాక్ వినిపిస్తోంది. ముఖ్యమంత్రి మందలించినా కంచర్ల భూపాల్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తీరులో మాత్రం మార్పు కాదు కదా తమ వ్యవహార శైలితో ఈసారి ఏకంగా ప్రజాభిమానం చెడగొట్టుకున్నారు. భూపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిల తీరుతో అసంతృప్తిగా ఉన్న హైకమాండ్ కూడా గుత్తా అమిత్ రెడ్డిని ఎంకరేజ్ చేస్తున్నట్టు పొలిటికల్ సర్కిళ్లలో రూమర్స్ వినిపిస్తున్నాయి.ఎన్నికలకు కొద్దినెలల సమయమే ఉండటం, టికెట్ రేసులో తాను పోటీలో ఉన్నానని చెప్పేందుకు పొలిటికల్ స్ట్రాటజీలతో దూసుకెళ్తున్నారు గుత్తా అమిత్ రెడ్డి. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కు చెందిన ఐప్యాక్ టీం సభ్యులను కూడా రంగంలోకి దించారట. అందుకే ఇటీవల సోషల్ మీడియా యాక్టివిటీతోపాటు గ్రౌండ్ లోనూ యాక్టివ్ అయ్యారు అమిత్ రెడ్డి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో యూత్ కు బాగా కనెక్ట్ అయ్యేందుకు నిరుద్యోగులు-విద్యార్థుల కోసం లక్షలు ఖర్చు చేసి ఉచిత ఆన్ లైన్ కోచింగ్ యాప్ కూడా లాంచ్ చేశారాయన. అటు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ పూర్తిగా పబ్లిక్ లోనే ఉంటున్నారు. హైకమాండ్ ఆదేశిస్తే నల్గొండ లేదా మునుగోడు ఎక్కడి నుంచైనా పోటీ చేసేందుకు గుత్తా సుఖేందర్ రెడ్డి వారసుడు గ్రౌండ్ ప్రిపరేషన్స్ చేసుకుంటున్నారట.

# దోస్త్ అడ్మిషన్లు షురూ...

**హైదరాబాద్ :**




తెలంగాణలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్(డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్ తెలంగాణ) నోటిఫికేషన్ ను ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఇందులో భాగంగా డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అయింది. శాతవాహన యూనివర్సిటీలో జూన్ 10 వరకు దోస్త్ తొలివిడత సీట్ల భర్తీ ప్రారంభం కానుంది. మే 20 నుంచి జూన్ 11 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పిస్తారు. ఖాళీగా ఉన్న డిగ్రీ సీట్లను జూన్ 16న కేటాయిస్తారు. తిరిగి జూన్ 16 నుంచి జూన్ 26 వరకు రెండో విడతలో సీట్ల భర్తీ చేపడతారు. జూన్ 30న సీట్ల కేటాయింపులు జరగనున్నాయి. జులై 1 నుంచి జులై 6 వరకు మూడో విడత వెబ్ ఆప్షన్ల ప్రక్రియ, జులై 10న సీట్ల కేటాయింపు నిర్వహిస్తారు. జులై 17వ తేదీ నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి.దోస్త్ రిజిస్ట్రేషన్ నేటి నుంచి ప్రారంభం అవ్వడంతో శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కాలేజీల వివరాలను అధికారులు ప్రకటించారు. ఇందుకు సంబంధించి యూనివర్సిటీ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. గతేడాది శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని కాలేజీలు, భర్తీ అయిన సీట్లు, ఏ కాలేజీలో ఎన్ని సీట్లు ఉన్నాయనే వివరాలను సేకరించి నివేదికను రూపొందించారు. ఆ నివేదికను వీసీ ముందు ఉంచారు. వీసీ పరిశీలించిన అనంతరం ఆయా కాలేజీలకు కేటాయించిన సీట్లు ఇవాళ ప్రకటిం చనున్నారు. కరోనా దెబ్బతో చాలా ప్రైవేట్ కాలేజీ మూతపడ్డాయి. కాలేజీలను మూసివేసేందుకు ప్రైవేట్ యాజమాన్యాలు అనుమతి కోరినట్లు సమాచారం. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ కాలేజీల్లో ప్రవేశం పొందేందుకు దోస్త్ ద్వారా అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చు. విద్యార్థులు దోస్త్ ద్వారా సులభంగా అడ్మిషన్ పొందేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.విద్యార్థులు ముందుగా తమ ఫోన్ నంబర్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం వెబ్ లైట్ లో లాగిన్ అయిన దోస్త్ ఐడీ, పిన్ నెంబర్ జనరేట్ చేసుకోవాలి. వీటితో అప్లికేషన్‌ను నింపాలి. దరఖాస్తులో కోర్సులు, కాలేజీల వారీగా ప్రాధాన్యతా వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. విద్యార్థులు పెట్టుకున్న కాలేజీలో సీటు వస్తే అక్కడికి వెళ్లి సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా తెలుసుకోవచ్చు. కౌన్సెలింగ్ లో సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా ఎంపిక చేసుకున్న కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్లు సమర్పించి, ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ఎస్ఆర్ఆర్ కళాశాల, కరీంనగర్, జమ్మికుంట, హుజూరాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దోస్త్ సేవా కేంద్రాలను ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఇక్కడ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే రిజిస్ట్రేషన్ సమయంలో తప్పులు చేస్తే ఈ కేంద్రాల వద్ద సరిచేసుకోవచ్చు.

# నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఉద్రిక్తత

**నంద్యాల :**

టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా టీడీపీ నేత, బోండా ఉమా మహేశ్వరరావు వియ్యంకుడు ఏవీ సుబ్బారెడ్డిపై మాజీ మంత్రి భూమా అఖిలప్రియ వర్గీయులు దాడి చేశారు. ఈ దాడిలో ఏవీ సుబ్బారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఏవీ నోటీ నుంచి రక్తం కారడం ఆయన అభిమానులు, కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తోంది. లోకేష్ పాదయాత్ర 101వ రోజుకు చేరుకుంది. నంద్యాల-ఆత్మకూరు రోడ్డులో పాదయాత్ర సాగుతుండగా.. అటు అఖిల.. ఇటు ఏవీ సుబ్బారెడ్డి తమ బలాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో ఏవీ సుబ్బారెడ్డిపై దాడి జరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన సుబ్బారెడ్డి.. దమ్ముంటే డైరెక్ట్‌గా కక్ష తీర్చుకోవాలంటూ సవాల్ విసిరారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గీయులను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోనికి వచ్చింది.



### భూమా మరణాంతరం..!

భూమా నాగిరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి ఇద్దరూ ప్రాణ స్నేహితులు. భూమా బతికున్నంత వరకూ అన్నీ తానై చూసుకున్న ఏవీ.. ఆయన మరణాంతరం ఒక్కసారిగా విబేధాలొచ్చాయి. నాటి నుంచి తాను రాజకీయాల్లోకి రావాలని ఏవీ ప్లాన్ చేసుకున్నారు. అంతేకాదు.. అయితే నంద్యాల, లేకుంటే ఆళ్లగడ్డ నుంచి పోటీచేయాలని ఏవీ ఉవ్విళ్లూరుతున్నారు. ఈ క్రమంలో అఖిల ప్రియ వర్సెస్ ఏవీగా పరిస్థితులు మారిపోయాయి. ఇప్పటి వరకూ ఈ రెండు వర్గాల మధ్య ఎన్నిసార్లు గొడవలు జరిగాయో లెక్కలేదు. ఆ మధ్య ఏవీ సుబ్బారెడ్డిపై అఖిలప్రియ భర్త నేతృత్వంలో హత్యకు ప్లాన్ చేయడాన్ని కూడా కడప జిల్లా పోలీసులు గుర్తించిన కేసులు పెట్టిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుంది. అప్పట్లో ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనమే అయ్యింది. నాటి నుంచి నేటి వరకూ ఈ రెండు వర్గాల వారు ఎక్కడ ఎదురుపడినా కొట్లాటలు.. ఎప్పుడు మీడియా ముందుకొచ్చిన మాటల తూటాలు పేలుతున్నాయి.

### అసలేం జరిగింది..!?

రానున్న ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్న.. తనకే కచ్చితంగా టికెట్ వస్తుందన్న ధీమాతో సుబ్బారెడ్డి ఉన్నారు. ఈ విషయాన్ని లోకేష్ పాదయాత్ర ద్వారా అందరికీ తెలియజేయాలని భావించిన ఏవీ సుబ్బారెడ్డి తన బలాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఈ క్రమంలో ఎవరు ఎవర్ని రెచ్చగొట్టుకున్నారో లేకుంటే పనిగట్టుకుని మరీ ఇలా దాడిచేశారో తెలియట్లేదు కానీ.. పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనపై టీడీపీ అధిష్టానం ఎలా రియాక్ట్ అవుతుంది..? పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎలా స్పందిస్తారు..? అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ప్రజాతపన
prajathapana.com

# రికార్డుల ట్యాంపరింగ్ లో ధరణి

**హైదరాబాద్ :**

'ధరణి పోర్టల్ వచ్చేసింది. ఇక రెవెన్యూ రికార్డులు భద్రం. లాకర్‌లో పెట్టి తాళం వేసినట్లే.. ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరు. రికార్డులను దిద్దలేరు.' అంటూ ప్రభుత్వం గొప్పలు చెబుతున్న.. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రికార్డులు ట్యాంపరింగ్ చేయలేకపోవచ్చు కానీ లేని వివాదాలను సృష్టించడానికి అక్రమార్కులకు ఈ పోర్టల్ లో ఎన్నో అవకాశాలున్నాయి. ఒకరి భూమిపై మరొకరు వివిధ కోణాల్లో దరఖాస్తులు సమర్పించే వీలుంది. కావాలనే భూములపై వివాదాలు సృష్టించే ఆస్కారముంది. సాగుచేసుకుంటున్న భూమిని నాలా కన్వర్షన్ చేయమని ఇతరులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజు చెల్లిస్తే చాలు. అయితే దరఖాస్తు చేసిన వ్యక్తి పట్టాదారేనా? మరెవరైనా? అనేది అవసరం లేదు. ఆఖరికి సక్సెషన్, మ్యుటేషన్ కి కూడా ఏవో పత్రాలు సమర్పించి దరఖాస్తు చేయవచ్చు. అధికారులు డాక్యుమెంట్లు పరిశీలించి తిరస్కరించవచ్చు. కానీ దరఖాస్తు సమర్పణ నుంచి తిరస్కరణ వరకు రెండు, మూడు నెలల సమయం పట్టొచ్చు. ఆ టైమంతా సదరు భూమిపై దరఖాస్తు పెండింగ్ ఉన్నట్లు చూపిస్తుంది. దాంతో ఒరిజినల్ పట్టాదారుడు అమ్మేందుకు స్లాట్ బుక్ కాదు. ఏ ఇతర సదుపాయాలను వినియోగించుకోలేడు. దరఖాస్తు తిరస్కరణకు గురయ్యే వరకు వేచి చూడాల్సిందే. తీరిక దొరికినప్పుడు తహశీల్దార్, కలెక్టర్లు పరిశీలిస్తారు. అప్పుడు వెరిఫికేషన్ లో లోపాలు గుర్తిస్తే ఆన్ గోయింగ్ ట్రాన్సాక్షన్ (పెండింగ్ దరఖాస్తు) అనేది ట్రాన్సాక్షన్ స్టేటస్ నుంచి పోతుంది. అప్పటి దాకా పట్టాదారుడికి చుక్కలే. రూ.కోట్లు విలువచేసే భూములపై అక్రమార్కులే దరఖాస్తులు సమర్పిస్తూ కొత్త వివాదాలకు తెర తీస్తున్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తుంకి కాల్సలో సర్వే నం.700 లో 1.14 ఎకరాలు, ఖాతా నం.963 ద్వారా పంది సత్తయ్య పేరిట ఉన్నది. అది పట్టా ల్యాండ్. దానిపై ఎలాంటి వివాదాలు లేవు. ఆధార్, ఈ కేవైసీ పూర్తయింది. పట్టాదారు పాసు పుస్తకం కూడా వచ్చింది. ఆఖరికి రైతుబంధు సొమ్ము కూడా ఖాతాలో జమ అవుతుంది. ఈ భూమిని అవసరానికి వేరే వాళ్లకు అమ్మేందుకు యత్నించారు. స్లాట్ బుక్ చేసుకోవడానికి వెళితే 'ఆన్ గోయింగ్ ట్రాన్సాక్షన్ ఆన్ ర్వే నెంబర్ విత్ అప్లికేషన్ నెంబర్ 2300109002 ఇన్ మ్యుటేషన్/సక్సెషన్/నాలా ప్రాసెస్.' అని ఉంది. ఈ మూడింట్లో ఏ ఆప్షన్ కింద కూడా పట్టాదారుడు అప్లై చేసుకోలేదు. దీంతో తన సొంత భూమిపై ఇలాంటి దరఖాస్తు పెండింగులో ఉండడం చూసి రైతు లబోదిబోమన్నాడు. ఆఫీసులో ఎంక్వయిరీ చేస్తే ఎవరో నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసినట్లుగా కనిపించింది. తనకు తెలియకుండా, తన అనుమతి లేకుండా ఎలా అప్లై చేస్తారంటూ అధికారులను ప్రశ్నించాడు. అదంతా తమకేం తెలుసంటూ రెవెన్యూ వర్గాలు రిప్లై ఇచ్చాయి. పట్టాదారుడు ఎక్కడా సంతకం పెట్టకపోయినా సొంత భూమిపై ఇతరులెవరో స్వభావాన్ని మార్చేందుకు దరఖాస్తు చేయగలగడం చర్చకు దారి తీసింది. దాంతో ఈ దరఖాస్తును క్యాన్సిల్ చేయాలంటూ ఏప్రిల్ ఆరో తేదీన వర్గల్ తహశీల్దార్‌కి దరఖాస్తు చేసుకున్నాడు. ఇలా దరఖాస్తు చేసుకోవడానికి ధరణి పోర్టల్ లో ఎలాంటి ఆప్షన్ లేదు. దాంతో లిఖితపూర్వకంగా అర్జీ పెట్టుకున్నాడు. పంది సత్తయ్యకు చెందిన ల్యాండ్ పై ఆయనకి తెలియకుండానే ఇతరులెవరో అప్లికేషన్ పెట్టుకున్నారని, దాన్ని క్యాన్సిల్ చేయాలంటూ సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కి లేఖ నం.బి/564/2022, తేదీ.13.4.23 ద్వారా వర్గల్ తహశీల్దార్ సిఫారసు చేశారు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ ట్రాన్సాక్షన్ స్టేటస్ యథాతథంగా కొనసాగుతుండడం విశేషం. సొంత భూమిపై ఇతరులెవరో దాఖలు చేసిన అప్లికేషన్ పెండింగ్ ఉంటే హక్కుదారుడి పరిస్థితి ఎలా ఉంటుందో అందరికీ తెలుసు. రూ.లక్షలు విలువజేసే భూమిపై ఏ చిన్న చిక్కులు తలెత్తినా తట్టుకునే స్థితిలో సామాన్యులెవరూ లేరు. అయితే అధికారులు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. వాస్తవాలు గుర్తించినా నెల రోజుల నుంచి సదరు అప్లికేషన్ ని రిజెక్ట్ చేయకపోవడం విడ్డూరంగా కనిపిస్తున్నది. తహశీల్దార్ కూడా కలెక్టర్ కి సిఫారసు చేశామంటూ చేతులెత్తేశారు. క్షేత్ర స్థాయిలో అకారణంగా వివాదాల్లో భూమి చిక్కుల్లో పడేశారంటూ ఆందోళనకు గురవుతున్న బాధితులకు న్యాయం చేసేందుకు తాత్సారం చేస్తుండడం గమనార్హం. ధరణి పోర్టల్ లో భూములపై ఎవరైనా చేయొచ్చనే ఆప్షన్ తోనే ప్రమాదం నెలకొన్నది. దరఖాస్తు చేసిన తర్వాత ఈ కేవైసీ చేస్తేనే లాగిన్ లోకి వెళ్తుంది. కానీ అప్పటి దాకా పెండింగ్ లో ఉంటుంది. ఇటీవల కేశంపేట మండలంలో ఓ రియల్టర్ కి రైతు భూమి అమ్మనని తెగేసి చెప్పాడు. తనకు నచ్చిన రేటు దక్కకపోవడంతో ససేమిరా అన్నాడు. దీంతో ఆ భూమిపై ఓ అప్లికేషన్ పెట్టి ట్రాన్సాక్షన్ స్టేటస్ పెండింగ్ అని కనిపించేటట్లు చేశారని తెలిసింది. దాంతో ఇతరులెవరూ సదరు భూమిని కొనుగోలు చేసేందుకు రాలేదు. ఇలాంటి ఆప్షన్లను కూడా అక్రమార్కులు వినియోగించుకుంటున్నారు. పెండింగ్ అప్లికేషన్ రిజెక్ట్ చేయాలంటూ దరఖాస్తుదారుడే సిద్ధం కావాలి.. అప్పటి దాకా ట్రాన్సాక్షన్ స్టేటస్ పెండింగ్ అంటూ కనిపిస్తున్నది. గొప్పగా రూపుదిద్దిన ధరణి పోర్టల్ లో ఇలాంటి లోపాలతో సామాన్య రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. ప్రతి రోజూ ధరణి పోర్టల్ లో చెక్ చేసుకోకపోతే ప్రమాదం ఏ మూల నుంచి వస్తుందో గ్రహించడం కష్టంగా మారింది.

# పార్టీ వ్యూహరచనపై కేసీఆర్ దృష్టి

**హైదరాబాద్ :**

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చాలామంది రాజకీయ నాయకులపైన, కొన్ని రాజకీయ పార్టీలపైన పెను ప్రభావమే చూపినట్టు కనిపిస్తుంది. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ భవిష్యత్తును ఊహించుకుంటూ పార్టీల మార్పును చాలామంది నాయకులు ప్లాన్ చేసుకుంటున్నారు. అదే సమయంలో రాజకీయ పార్టీలు తమ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు కొత్త ఎత్తుగడలను వేస్తున్నాయి. ఈ కోవకు చెందిన రాజకీయ నాయకులపైన పొలిటికల్ పార్టీలపైన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చాలా ఇంపాక్ట్ చూపిస్తున్నాయి. కర్ణాటక ఎన్నికల్లో బిజెపి గెలుస్తుందా.. అయితే ఒక విధానాన్ని అనుసరిద్దాం, కాంగ్రెస్ గెలుస్తుందా.. దానికి మరొక విధానాన్ని కొనసాగిద్దాం, ఈ రెండు కాకుండా హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందా అప్పుడు మరో కొత్త వ్యూహాన్ని రచిద్దాం ఇలా సమాలోచనలు చేశాయి కొన్ని పార్టీలు.. చర్చలు జరిపారు కొంతమంది నేతలు. ఇలాంటి పరిస్థితులలో కన్నడ ఓటరు ఊహకందని తీర్పు ఇచ్చాడు. 2014 నుంచి ప్రతి ఎన్నికకు ఎంతో కొంత దెబ్బతింటూ వస్తున్న కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక ఎన్నికల ఫలితం కొత్త ఆశలు రేకెత్తించింది. అదే సమయంలో 2024 ఎన్నికల్లోను విజయం సాధించి మూడోసారి అధికారంలోకి వస్తామని కలలు కంటున్న కమలనాథులకు ఝలక్ ఇచ్చింది. బిజెపి నేతలు తాము పయనిస్తున్న మార్గాన్ని పునరాలోచన చేసుకోవాల్సిన అవసరాన్ని కల్పించాడు కన్నడ ఓటరు. గమ్మత్తైన విషయం ఏమిటంటే ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి అక్కడ సీఎం అభ్యర్థిని ఎంపిక చేయడం కష్టసాధ్యంగా మారింది. నువ్వా నేనా అన్నట్లుగా పోటీపడిన మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కెపిసిసి అధ్యక్షుడు డీకే శివకుమార్ పట్టు సడల నీయకుండా సీఎం సీటు కోసం యత్నాలు కొనసాగించారు. ఇవే తనకు చివరి ఎన్నికలు అని ముందే ప్రకటించిన మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పార్టీ ప్రతిపాదించే రాజీ ఫార్ములాకు ఓకే అంటూనే తొలి అవకాశం తనకి ఇవ్వాలని కోరారు. అదే సమయంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షునిగా అన్ని శక్తులు ఫణంగా పెట్టి మరి కాంగ్రెస్ విజయానికి కారణమైన తనకు ఎలాంటి రాజీ ఫార్ములా లేకుండా పూర్తి ఐదేళ్ల సీఎం పదవీ కాలాన్ని ఇవ్వాలని శివకుమార్ గట్టిగానే పట్టుపట్టారు. ఇదంతా కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయం. దీన్ని పక్కన పెడితే కర్ణాటక ఎన్నికల ఫలితం తెలుగు రాష్ట్రాలలోని పార్టీలపైనా, నేతలపైనా ప్రభావం చూపిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. గత సంవత్సరం దసరా శుభ ముహూర్తాన తెలంగాణ రాష్ట్ర సమితిని కాస్త జాతీయ పార్టీగా మారుస్తూ భారత రాష్ట్ర సమితిగా గులాబీ బాస్ తన పార్టీ సహచరుల మధ్య తీర్మానించారు. ఆ తర్వాత పొరుగు రాష్ట్రాలలో భారత రాష్ట్ర సమితిని పాదుకొల్పే ప్రయత్నాలను ముమ్మరంగా కొనసాగించారు. మహారాష్ట్రలో అయితే రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించారు. కొన్నిచోట్ల లోకల్ బాడీస్ ఎన్నికలలో కూడా పార్టీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపారు. త్వరలో మరొక భారీ బహిరంగ సభ నిర్వహణకు కూడా కెసిఆర్ సంసిద్ధమయ్యారు. కానీ తాజాగా ఆయన వ్యూహం మార్చుకున్నట్లు తెలుస్తోంది.



ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో పార్టీ రాష్ట్ర శాఖలను ఏర్పాటు చేయాలని తొలుత భావించినా.. ప్రస్తుతానికి ఈ కార్యక్రమాన్ని ఇప్పుడు కాస్త నెమ్మదింప చేయాలని కెసిఆర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక ఫలితమే కెసిఆర్ గమనాన్ని మార్చివేసిందని కొందరు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జాతీయ రాజకీయాలపై ఆశలను కొన్ని రోజులు పక్కనపెట్టి ముందుగా తెలంగాణలో మరోసారి అధికారం చేపట్టడానికి అవసరమైన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని కేసిఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణకు 2023 అక్టోబర్ లేదా నవంబర్ మాసాల్లో ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలకు ఆ తర్వాత మరో ఆరు నెలల గడువు ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటినుంచి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేదాకా రాష్ట్ర రాజకీయాలపైనే కెసిఆర్ ఫోకస్ చేస్తారని సమాచారం. ఆ తర్వాత ఫలితాన్ని బట్టి జాతీయ పార్టీని ఎటువైపు నడపాలన్న దానిపై సమాలోచనలు తిరిగి ప్రారంభిస్తారని తెలుస్తుంది. జాతీయ పార్టీగా అవతారం ఎత్తిన భారత రాష్ట్ర సమితి ఒక దశలో హస్తిన పీఠమే లక్ష్యంగా చక్రం తిప్పబోతున్నట్లు ప్రచారం చేసుకుంది. పొరుగు రాష్ట్రాలలో పార్టీని విస్తరించడమే కాకుండా జాతీయస్థాయిలో విపక్షాలను ఏకం చేసే బృహత్తర కార్యక్రమంలో కూడా తానే సారథిని అవుతానని కేసీఆర్ అనుకున్నారు. అందులో భాగంగా పలువురు జాతీయ నాయకులతో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కెసిఆర్ భేటీలు నిర్వహించారు. ఆయన కలిసిన వారిలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, పంజాబ్ సీఎం బలవంత్ సింగ్ మాన్, ఒడిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తదితరులు ఉన్నారు. పార్లమెంటు సమావేశాలు కొనసాగిన తరుణంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన ఆందోళనలో కాంగ్రెస్ సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో కూడా భారత రాష్ట్ర సమితి నాయకులు చురుకుగా పాల్గొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీతో ఎక్కువగా అంటకాగితే అది తెలంగాణలో ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉండడంతో కొద్దిగా జాగ్రత్త పడ్డారు భారత రాష్ట్ర సమితి నేతలు. తెలంగాణలో కెసిఆర్ పార్టీకి రెండు పార్టీల నుంచి సవాల్ ఎదురవుతుంది. అయితే కర్ణాటక ఎన్నికలకు ముందు తెలంగాణలో బిజెపిని తమ ప్రధాన ప్రత్యర్థి అని కెసిఆర్ భావించారు. కాంగ్రెస్ పార్టీ మూడో స్థానానికి పరిమితం అవుతుందని అంచనా వేశారు. అందుకే బీజేపీ మీద కాస్త ఎక్కువ స్థాయిలో విమర్శలు గుప్పించారు. కానీ తాజాగా కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకోవడంతో కేసీఆర్ రూటు మార్చినట్లు తెలుస్తోంది. పార్టీ వ్యూహరచన మీద కేసీఆర్ మరోసారి దృష్టి సారించాల్సిన పరిస్థితి తలెత్తింది. కర్ణాటకలో గత 40 సంవత్సరాలలో ఎన్నడూ రానన్ని సీట్లను కాంగ్రెస్ పార్టీ ఈసారి గెలుచుకుంది. దాని ప్రభావం తెలంగాణ మీద ఉంటుందని భారత రాష్ట్ర సమితి నేతలు భావిస్తున్నారు. అందుకే రాష్ట్రం మీద పట్టు సడలనీయకుండా ప్రయత్నాలు కొనసాగించాలని తాజాగా తీర్మానించినట్లు తెలుస్తోంది. జాతీయ రాజకీయాలపై ఇప్పుడే ఎక్కువగా ఫోకస్ చేస్తే అది స్థానికంగా తమ పునాదులను కదిలించే ప్రమాదం ఉందని కొందరు భారత రాష్ట్ర సమితి నేతలు గుసగుస లాడుకుం టున్నారు. అన్ని అంశాలను బేరీజు వేసుకున్న కేసీఆర్ ఇప్పటినుంచి తొలి ఆరు నెలలు తెలంగాణ రాజకీయాలపైనా.. ఆ తర్వాతి ఆరు నెలలు జాతీయ రాజకీయాలపైన దృష్టి సారిస్తారని పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. నిజానికి ప్రాంతీయ పార్టీని జాతీయ పార్టీగా మార్చిన తరుణంలో తమ నెక్స్ట్ స్టెప్ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలేనని కేసీఆర్ ప్రకటించారు. కానీ కారణం ఏదైతేనేం కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు కెసిఆర్ పార్టీ దూరంగా ఉండిపోయింది. అక్కడ త్రిముఖ పోటీ జరిగితే బిజెపికి లభిస్తుందన్న అంచనా వల్లే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వైపు కేసీఆర్ దృష్టి సారించలేదని కొందరు విశ్లేషిస్తున్నారు. అయితే తనకు మొదటి నుంచి సన్నిహితంగా ఉంటూ వస్తున్న జెడిఎస్ అధినేత కుమారస్వామికి కొంత ఆర్థిక సహాయం చేసి ఉండవచ్చన్న ప్రచారం కూడా ఉంది. ఏది ఏమైతేనేం ప్రస్తుతానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ముగిసాయి. ఇప్పుడు కేసీఆర్ దృష్టి అంతా తెలంగాణ పైనే.

# కొత్త సచివాలయంలో కేబినెట్

**హైదరాబాద్ :**

గురువారం నాడు తెలంగాణ మంత్రివర్గం కీలక భేటీ జరుగనుంది. కొత్త సచివాలయంలో మొదటి కేబినెట్ భేటీ జరుగనుంది. . కొత్తగా నిర్మించిన తెలంగాణ సచివాలయంలో తొలిసారి కేబినెట్ సమావేశం జరగనుంది. 18న మధ్యాహ్నం 3 గంటలకు మంత్రివర్గ సమావేశం ప్రారంభం కానుంది. మంత్రులతో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఈ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తాజా రాజకీయ అంశాలపై చర్చించ నున్నారు. బుధవారం శాసనసభాపక్షం, గురువారం కేబినెట్ భేటీ వరుసగా జరుపడం వెనుక నిగూఢ రహస్యం ఏంటనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. కేసీఆర్ నయా వ్యూహంలో భాగంగానే ఈ సమావేశాలు ఉన్నాయని అంతా భావిస్తున్నారు. ఈ రెండు సమావేశాల్లో ఏం చర్చిస్తారు? ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అనేది ఉత్కంఠగా మారింది. కర్నాటక ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడం.. బీజేపీ ఓటమిపాలవడం తదుపరి ఎన్నికలు జరుగనున్న 5 రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉండటంతో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే కర్నాటకలో ఓటమిపాలైన బీజేపీ.. తెలంగాణలో ఎలాగైనా అధికారం చేపట్టాలని ప్లాన్స్ వేస్తోంది. ఆ దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే బడా బడా నేతలు రాష్ట్రానికి వరుసగా వస్తుండగా.. ఇప్పుడు మరికొందరు నేతలను రంగంలోకి దించి.. పూర్తి స్థాయిలో తెలంగాణపై ఫోకస్ పెట్టాలని భావిస్తోంది బీజేపీ అధిష్టానం. ఇలాంటి తరుణంలో జరుగనున్న కీలక భేటీల్లో గులాబీ బాస్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఉత్కంఠగా మారింది.

# నేత్రదానంకు ముందుకు వచ్చిన ఆదర్శ దంపతులు

**కమాన్ పూర్**



రామగుండం కార్పొరేషన్- గోదావరిఖని లక్ష్మీనగర్ లోని అంబికా హాస్పిటల్ మెడికల్ షాప్ నిర్వాహకుడు కొండ సంపత్ ఆయన భార్య రమాదేవి తమ పెళ్లి రోజును పురస్కరించుకుని, మరణాంతరం తమ నేత్రాలను దానం చేస్తామని ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు రాజమౌళి, ప్రతినిధి కే.ఎస్.వాసు ఆధ్వర్యంలో సోమవారం హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంపత్ కు, హాస్పిటల్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ చేతుల మీదుగా సదాశయ ఫౌండేషన్ అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ... నేత్రదానం చేయడానికి తన హాస్పిటల్ సిబ్బంది సంపత్ ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలు మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సదాశయ ఫౌండేషన్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు. దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వహణ ఇంచార్జ్ వేణుగోపాల్ తోపాటు సిబ్బంది సురేష్, సాగర్, శ్రావణ్, అబ్జల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. సంపత్ దంపతులను సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణ్ కుమార్, లింగమూర్తి, ప్రతినిధులు భీష్మాచారి, చంద్రమౌళి, బెణిగోపాల్ త్రివేది తదితరులు అభినందించారు.

# మూసినదిలో మహిళ తల

**హైదరాబాద్**



నగరం లో ఓ మహిళ తల నరికి మూసీ నదిలో పడవేసిన ఘటన చోటు చేసుకుంది,ఎంత దారుణం.. ఘోరం.. మనిషి రక్తం చూస్తేనే కళ్లు తిరుగుతాయి అలాంటి.. ఇప్పుడు మనుషులను చంపటం నుంచి..శరీరాన్ని ముక్కలు ముక్కలు నరికే స్థాయికి వచ్చేశారు దుర్మార్గులు. కసి, కోపం, పగ ఏ స్థాయిలో ఉంటున్నాయో ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. మొన్నటికి మొన్న సొంత సోదరుడు చనిపోయాడని.. అంత్యక్రియలకు డబ్బులు లేవంటూ.. బాడీని ముక్కలు ముక్కలుగా చేసిన ఘటన షాకింగ్ కు గురి చేసింది. ఇప్పుడు లేటెస్ట్ గా.. 2023, మే 17వ తేదీ హైదరాబాద్ సిటీ నడిబొడ్డున ఉన్న మూసీ నదిలో ఓ మహిళ తల కనిపించటం సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే..మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని తీగలగూడ మూసీ నది ఒడ్డున ఓ మహిళ తల కనిపించింది. ఓ ప్లాస్టిక్ కవర్ లో ఉన్న తలను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొండెం లేని తలను ఎవరో తీసుకొచ్చి ఇక్కడ పడేసినట్లు చెబుతున్నారు. మొండెం ఎక్కడ ఉందో విచారణ చేస్తున్నారు పోలీసులు. ఎక్కడో హత్య చేసి.. తలను కోసి.. మూసీ నదిలో పడేసిట్లు ఘటనా స్థలాన్ని చూస్తే అర్థం అవుతుంది. తలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మొండెం కోసం వెతుకులాట మొదలుపెట్టారు. విషయం తెలిసిన వెంటనే పోలీస్ టీమ్స్ స్పాట్ కు చేరుకున్నాయి. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయి. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అడిషనల్ డీసీపీ ఆనంద్ స్పాట్ కు వచ్చి విచారణ చేస్తున్నారు. ఈ మహిళ ఎవరు.. ఏ ప్రాంతానికి చెందిన వారు.. హత్య చేయటానికి కారణాలు ఏంటీ.. చేసింది ఎవరు.. ఎప్పుడు, ఎక్కడ హత్య జరిగింది.. తలను వేరు చేయటానికి కారణాలు ఏంటీ అనే విషయాలపై విచారణ చేస్తున్నారు. తల ఆధారంగా మహిళ ఎవరు అనేది గుర్తించటానికి ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేశారు పోలీసులు

# రైతు సమస్యలపై అధికారులు స్పందించాలి

**పెద్దపల్లి**

రైతు సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని మాజీ ఎమ్మెల్యే విజయ రమణా రావు డిమాండ్ చేశారు. మండలంలోని అప్పన్నపేట గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వడ్లు పోసి 30 రోజులు అయినా కొనుగోలు చేయడం లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్లల్లో తేమ శాతం వచ్చిన కూడా కొనుగోలు విషయంలో జాప్యం చేస్తున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రైతులను పట్టించుకోకుండా మభ్య పెడుతు న్నారని మండిపడ్డారు. వడ్లు తడిచిన, రంగుమరిన, ముక్క వచ్చిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ముఖ్య మంత్రి తెలిపారని, పౌర సరఫరాల శాఖమంత్రి మరియు పౌర సరఫరాల శాఖ చైర్మన్ రవీందర్ సింగ్ రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకుంటానని అన్నా క్షేత్ర స్థాయిలో వారి మాటలు అమలు కావడం లేదని అన్నారు. రైతుల వడ్లు ఐకేపీ సెంటర్లో కొనుగోలు అయిన వెంటనే ట్రక్ షీట్ ఇవ్వాలి ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, రైస్ మిల్లర్స్ అందరూ కలిసి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు పండించిన పంటను వెనువెంటనే కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతులతో కలిసి ఎమ్మెల్యే ఇంటి ముందు దర్నా చేస్తామని హెచ్చించారు. రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేసేంత వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com

# యువతకు బంగారు బాట

**కేంద్ర మంత్రి భగవర్ కిషన్ రావు కరద్**

**విశాఖపట్నం**

దేశ యువత భవిష్యత్తుకు బిజెపి ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయక మంత్రి భగవత్ కిషన్ రావు కరద్ అన్నారు. విశాఖ నగరం ఎంతో అందంగా, పరిశుభ్రంగా ఉందని అదేవిధంగా మంగళవారం 5వ విడత ప్రధానమంత్రి రోజ్ ఘర్ యోజన కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చానన్నారు. ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహి స్తుండగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలో ప్రారంభించారని ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి తాను ముఖ్యఅతిథిగా విచ్చేశానన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా మంగళవారం 71 వేల మందికి నియామక పత్రాలు అంద జేయడం జరిగిందన్నారు. అదేవిధంగా విశాఖపట్నంలోని పోర్టు కళవాణి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 400 మంది కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలలో ఉద్యోగాలు సాధించిన వారికి ఈ నియామక పత్రాలు తాను అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి రోజ్ ఘర్ యోజన కార్యక్రమం ప్రారంభించి ఏడాదిన్నర అవుతుంది ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మూడు లక్షల 50 వేల మంది నిరుద్యోగులకు తమ ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం నగరంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ మీటింగ్లో పాల్గొనడం జరిగిందని కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి జన్ ధన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమా యోజన, వంటి కేంద్ర ప్రభుత్వం పథకాలపై రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో సమిక్ష నిర్వహించమని ఈ సమావేశంలో భాగంగా గ్రామిణ ప్రాంతాల ప్రజలకు బ్యాంకింగ్ రంగంపై అవగాహన కల్పించడం కోసం నాబార్డ్ సహకారంతో ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని. దేశంలో నీతి అయోగ్ 112 జిల్లాలు వెనుకబడ్డాయని విడుదల చేసిన జాబితాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2 జిల్లాలు ఉన్నాయని ఈ జిల్లాల అభివృద్ధికి అవసరమయ్యే నిధులు మరియు సంక్షేమ కార్యక్రమాలపై చర్చలు నిర్వహించామని ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బుడి ముత్యాల నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ప్రధాన కార్యదర్శి రావత్ పాల్గొన్నారని ఆయన తెలిపారు. అనంతరం విశాఖ పార్లమెంట్ నియోజకవర్గంలోని తమ పార్టీ నాయకులతో భేటీ అయ్యేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చానని పార్టీ బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో సేల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, బిజెపి అధికారిక స్పోక్స్ పర్సన్ సుహాసిని ఆనంద్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, విశాఖపట్నం జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈ-పాస్ యంత్రాల ద్వారా సకాలంలో రైతులకు ఎరువులు

**పెద్దపల్లి**



ఈ పాస్ యంత్రాల ద్వారా సకాలంలో రైతులకు ఎరువులు అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లాలోని వ్యవసాయ అధికారులు, లైసెన్స్ డీలర్ లతో సమావేశం నిర్వహించారు. వానాకాలం పంటలో అవసరమైన ఎరువులు సకాలంలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా పక్క ప్రణాళిక ప్రకారం పని చేయాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఎరువులను 40 శాతం మార్క్ ఫెడ్ ద్వారా, 20 శాతం ఆగ్రో ద్వారా, 40 శాతం ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సకాలంలో సరఫరా చేస్తామని అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. జిల్లాలో ఉన్న 337 రిటైల్ డీలర్లు ఈ పాస్ యంత్రాల ద్వారా ఎరువుల విక్రయాలు తప్పనిసరి గా జరిగే విధంగా చూడాలని అన్నారు. డీలర్లు లైసెన్స్ ఉన్న చోట షాప్ తప్పనిసరిగా ఈ పాస్ ద్వారా విక్రయాలు జరగాలని, సదరు డీలర్లు అదనపు పాయింట్లలో విక్రయాలు చేయాలను కుంటే ఈ పాస్ యంత్రాలతో చేయవచ్చని, కాని లైసెన్స్ షాప్ మాత్రం మూసివేయడానికి వీలు లేదని అన్నారు. మన జిల్లాలో 33 వేల 323 మెట్రిక్ టన్నుల యూరియా, 8 వేల 552 మెట్రిక్ టన్నుల డీఏపి, 7 వేల 125 మెట్రిక్ టన్నుల ఎంఓపి, 25 వేలు 488 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 600 మెట్రిక్ టన్నుల ఎస్.ఎస్.పి , 250 మెట్రిక్ టన్నుల సిటి కాంపోస్ట్ మొత్తం 75 వేల 338 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతా యని, ప్రస్తుతం మన వద్ద జిల్లాలోని గోడౌన్లలో 35 వేల 654 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటు లో ఉన్నాయని అధికారులు వివరించారు. జిల్లాలో ఉన్న 337 ఈ పాస్ యంత్రాల పనితీరు పరిశీలిం చాలని, అవసరమైన చోట మరమ్మత్తులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, డీలర్ లు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా ప్రభుత్వ విద్యా సంస్థలు

**మంత్రి బొత్స సత్యనారాయణ**

**విజయవాడ**

విద్యారంగాన్ని ప్రోత్సహిస్తూ, పేదలు అధికంగా చదివే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలబడేలా చూడాలని ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని మంత్రి బోత్స సత్యనారాయణ అన్నారు. మౌలిక వసతుల కల్పన, దీర్ఘకాలిక ప్రయోజనాలు వచ్చే దిశలో అధునాతన వసతులు, మెరుగైన విద్యా బోధన తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం. ఇంతవరకు అమలు చేసిన వినూత్నమైన, విప్లవాత్మకమైన కార్యక్రమా లకు తోడుగా ఈ సంవత్సరం నుంచి పబ్లిక్ పరీక్షల్లో (10 వతరగతి, ఇంటర్మీడియట్) అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారిని ప్రోత్సహించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని అన్నారు. నగదు ప్రోత్సాహకం, మెరిట్ సర్టిఫికేట్ తోపాటు ఆయా విద్యార్థుల తల్లిదండ్రులను.. పాఠశాలలకు కూడా ప్రోత్సహించడం ద్వారా, ఇతర విద్యార్థుల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలన్న తపన. ఆసక్తి, పట్టుదల పెరిగేలా చూడా లన్నది ప్రభుత్వ ఆశయం. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో నిర్వహించిన 10వ తరగతి, ఇంటర్మీ డియట్ పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలు సాధించిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ప్రభుత్వ యాజమాన్యం లోని విద్యా సంస్థల విద్యార్థు లకు ప్రోత్సాహ కాలను అందించాలని ప్రభు త్వం నిర్ణయిం చింది. ఇంటర్మీడి యట్ స్థాయిలో ఎంపీసీ, బైపిసీ, హెచ్ఈసీ, మరియు సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో అగ్రస్థానాల్లో నిలిచిన వారికి ఈ మెరిట్ అవార్డులను ఇవ్వాలని నిర్ణయిం చాము. అలాగే ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదం డ్రులను కూడా సత్కరించి, ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాలను చేపట్టను న్నాము. పదో తరగతి స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి, ఇంటరీ మ్డియట్ స్థాయిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న ఒక్క విద్యార్థికి ఈ అవార్డులను అందచేయనున్నాము. విద్యా శాఖా పరంగా అంతర్గతంగా చర్చిం చుకున్న అనంతరం, ముఖ్యమంత్రి గారి ఆమోదంతో వీటిని అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మూడు అంచెల్లో అందించేలా కార్యాచరణను రూపొందిం చామని మంత్రి వెల్లడించారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**తాండూర్**



మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని మాదారం ఎస్ఐ గా జాయిన్ అయిన రాజశేఖర్ ను తాండూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్సై జి.రాజశేఖర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలు బానిసలు కావద్దని, మంచి ప్రవర్తనతో విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు వెళ్లి తల్లిదండ్రులకు, తమ గ్రామానికి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా మంచి ప్రవర్తన తో మంచి గా చదువు కొన్ని తల్లిదండ్రులకు, గురువులకు, ఊరికి మంచి పేరు తీసుకొని రావాలని యువత ను కోరారు. ప్రస్తుతం యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి చెడు దారులకు వెళుతున్నారని, అలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు, యువత మంచి ప్రవర్తన తో ఉండాలని కోరారు. మధ్య కాలంలో యువత చెడు వ్యసనాలకు బానిసై క్షణికావేశంతో బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. చెడు వ్యసనాలకు బానిస కావడం వలన అనుకున్న లక్ష్యాలను సాధించడంలో ఆటంకాలు ఎదురవుతాయి. యువతలో చాలామంది మద్యం, ఈవ్ టీజింగ్, సెల్ ఫోన్ చాటింగ్ లతో కాలాన్ని వృథా చేసుకుంటున్నారు. ఆధునిక ప్రపంచంలో చెడు వ్యసనాలకు బానిసలు కావడం వలన విజయాలను సాధించడం అంత తేలిక కాదు. అలా కాకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కాలాన్ని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం వలన భవిష్యత్తు తరాలకు పునాదులను వేసుకోవచ్చు. చెడు వ్యసనాలపై అవగాహన పెంచుకొని వాటికి దూరంగా ఉంటే మంచిది. చెడు వ్యసనాల వలన తాత్కాలికంగా ఆనందం పొందినా ఆ వ్యసనాలు భవిష్యత్తునే అంధకారంలో పడేస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. చెడు వ్యసనాలు, చెడు కార్యాలపై ఆసక్తి లేకపోతే ఏ పని చేపట్టినా ఆ పనిలో విజయం సాధించడంతో పాటు వారు మంచి పేరు ప్రఖ్యాతలను, ప్రతిష్టలను పొందుతారు. వ్యసనాల బారిన పడటం వలన తమ భవిష్యత్ నాశనం అవుతుందనే కాకుండా కన్నవారిని కూడా మోసం చేస్తున్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శులు కొడిమాల శ్రీకాంత్, శనిగారపు వినోద్, రవిందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భూ ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధికారులకు నోటీసులు

**ఏలూరు**

పెదవేగి గ్రామంలో 11ఎకరాల 15 సెంట్ల దేవాదాయ, గ్రామకంఠం భూముల ఆక్రమణ పై జిల్లా ఉన్నత అధికారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నోటీసులు జారీ చేసింది. దెందులూరు మండలం గాలాయిగూడెం గ్రామానికి చెందిన తిప్పాభట్ల సత్యనారాయణ అనే వ్యక్తి వేసిన పిటిషన్ మేరకు నోటీసులు జారీ చేసినట్లు న్యాయవాది గుంటూరు బాబు గణేష్ తెలిపారు. ఈ కేసును జూన్ 27 కు మొదటి వాయిదా వేశారు. పెదవేగి గ్రామంలో 14 ఎకరాలకు గాను 11 ఎకరాల 15 సెంట్లు భూమిని గ్రామకంఠంగా చూపిస్తున్నారు. అందులో 27 సెంట్లు శ్రీ పార్వతీ పరమేశ్వర దేవాలయం భూమి గా చూపిస్తున్నారు. ఈ గ్రామ కంఠం, దేవాదాయ శాఖ భూమిని పలువురు ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ భూముల అమ్మకాలకు, బ్యాంకు లోన్లకు అవకాశం లేకపోవడంతో ఆ భూములను మార్పు చేసి రిజిస్ట్రేషన్ కు అనుకూలంగా చేయాలని పెదవేగి తాసిల్దార్ జిల్లా కలెక్టర్కు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం కలెక్టర్ వద్ద ప్రతిపాదనలు పెండింగ్లో ఉన్నాయి. ఈ భూముల ఆక్రమణల తో పాటు పిటిషనర్ 5 సెంట్ల భూమిని మాజీ విఆర్వోలు తిప్పభట్ల నారాయణమూర్తి, తిప్పాభట్ల సుబ్రమణ్యముల తో పాటు పెదవేగి పిఎసిఎస్ కార్యదర్శి తిప్పాభట్ల శ్రీరామచంద్ర మూర్తి,తిప్పాభట్ల ఆంజనేయులు, తిప్పాభట్ల పుల్లయ్య లు ఆక్రమించారు. దేవాదాయ శాఖ భూములను గ్రామ కంఠం భూములుగా మార్పులు చేయడంతో పాటు గ్రామకంఠం భూములను రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా ప్రతిపాదనలు తయారు చేసే విషయంలో కూడా వీరి హస్తము ఉన్నట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకుల ఒత్తిళ్ళను రెవెన్యూ అధికారుల మీద తీసుకొచ్చి భూముల మార్పులకు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామకంఠం భూములుగా చూపిస్తున్న స్థలాలలో పెదవేగి పిఎసిఎస్ కార్యదర్శి మూడిళ్లు నిర్మించగా, మాజీ విఆర్వోలు, పిఎసిఎస్ ఉద్యోగి ఆంజనేయులు ముగ్గురు ఒక్కొక్క ఇల్లు నిర్మించుకున్నారు. ఈ గ్రామ కంఠం భూములలో 75 సెంట్లుకు పైగా ఆక్రమించిన వారిలో తిప్పా భట్ల సోదరులు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల అయ్యుండి కూడా హౌసింగ్ శాఖ రుణాలు తీసుకుని ఇళ్లు నిర్మించడంపై ఎటువంటి విచారణ లేకుండా హౌసింగ్ రుణాలను ఉద్యోగస్తులకు ఇవ్వడంపై గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ కి కూడా న్యాయ సేవ అధికార సంస్థ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ కు చెందిన ఐదు సెంట్ల స్థలాన్ని పిఎసిఎస్ కార్యదర్శి తిప్పాభట్ల శ్రీరామచంద్రమూర్తి, పిఎసిఎస్ ఉద్యోగి తిప్పాభట్ల ఆంజనేయులు, మాజీ విఆర్ఓలు తిప్పాభట్ల నారాయణమూర్తి, తిప్పాభట్ల సుబ్రహ్మణ్యం, తిప్పాభట్ల పుల్లయ్య లు ఆక్రమించడంపై కూడా పిటిషనర్ తిప్పాభట్ల సత్యనారాయణ న్యాయ సేవాధిక సంస్థను ఆశ్రయించారు. ఆక్రమణదారుల నుంచి తన ఐదు సెంట్ల భూమిని కాపాడటం తో పాటు పెదవేగి 752 సర్వే నెంబర్లు లో ఉన్న భూమి ఆక్రములపై విచారణ చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. పెదవేగి పిఎసిఎస్ కార్యదర్శి ఆక్రమణల వ్యవహారాలతో పాటు ఇతర వ్యవహారాలపై కూడా కలెక్టర్ ద్వారా విచారణ చేయాలని పిడిషన్లో కోరారు. పిటిషన్ను పరిశీలించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏలూరు జిల్లా కలెక్టర్కు, పెదవేగి తహసిల్దార్ కు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కు, పెదవేగి శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి దేవాలయం ఎగ్జిక్యూటివ్ అధికారికి, పెదవేగి పంచాయతీ కార్యదర్శి, ఏలూరు జిల్లా పంచాయతీ అధికారికి, ఏలూరు జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారికి నోటీసులు జారీ చేసింది. వీరితోపాటు మాజీ విఆర్వోలు తిప్పాభట్ల నారాయణమూర్తి, తిప్పాభట్ల సుబ్రమణ్యం, పెదవేగి పిఎసిఎస్ కార్యదర్శి తిప్పాభట్ల శ్రీరామచంద్రమూర్తి, పెదవేగి పిఎసిఎస్ ఉద్యోగి తిప్పాభట్ల ఆంజ నేయుల తో పాటు తిప్పాభట్ల పుల్లయ్యకి జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ నోటీసులు జారీ చేసింది. ప్రతివాదు లందరూ మొదటి వాయిదాకి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ముందు హాజరై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది

# మేము తప్పులు చేసి ఉంటే గంగమ్మ చూసుకుంటుంది

**శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ కమిటీ వెల్లడి**

**తిరుపతి**



తాతయ్యగుంట గంగమ్మ జాతరను ఈసారి భక్తులంతా కోరే విధంగా ఘనంగా నిర్వహించామని , ఇందులో తాము తెలిసి తప్పులకు పాల్పడి ఉంటే ఆ గంగమ్మ తల్లి తమకు తగిన శాస్త్రి చేస్తుందని స్థానిక తాతయ్య గుంట గంగమ్మ గుడి దేవస్థానం చైర్మన్ కట్ట గోపి యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి ప్రెస్క్లబ్లో బుధవారం జాతర విజయవంతం పై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కమిటీ సభ్యులు ధనశేఖర్, వెంకటేశ్వరరావు, కృష్ణమ్మ, భారతి తదితరులతో కలిసి గోపి మాట్లాడుతూ గంగమ్మ జాతరను విజయవంతం చేసిన నగర ప్రజలు, భక్తులు, పోలీస్ యంత్రాంగం, కార్పొరేషన్, ఏపీఎస్పీడీసీఎల్ రాష్ట్ర దేవాదాయ శాఖ లతోపాటు ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఉపమేయర్లు అభినయ రెడ్డి, ముద్ర నారాయణ , కార్పొరేషన్ కమిషనర్ హరిత తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పూల అలంకరణ విషయంలో చేస్తున్న ఆరోపణలకు తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు . పూల డెకరేషన్ ను ఓ దాతకు అప్పచెప్పామన్నారు. వాళ్లు చేసిన తప్పిదాన్ని ఆలయ కమిటీ పై రుద్దడం సమంజసం కాదన్నారు. ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తూ జాతరను రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగమ్మ తల్లిని రోడ్డుపైకి తీసుకువస్తే ఆ తల్లి ఈ వక్రబుద్ధిగాళ్లకు తగిన శాస్త్రి చేస్తుందని హెచ్చరించారు.

# మొగిలయ్య దంపతులకు సన్మానం

**వరంగల్ :**

వరంగల్ జిల్లాకు చెందిన కళాకారులు బలగం సినిమా క్లైమాక్స్‌లో తమ పాట ద్వారా ప్రేక్షకులను కన్నీరు పెట్టించిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్గ కళాకారులు పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. వరంగల్ జిల్లా దుగ్గొండి గ్రామానికి చెందిన మొగిలయ్య ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో వారికి ఆర్థికంగా చేయూత అందించేందుకు దళిత బందు పథకం ద్వారా మంజూరు అయిన కారును మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మొగిలయ్య దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా మొగిలయ్య, కొమురమ్మ దంపతులు సీఎం కేసీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌కు మొగిలయ్య దంపతులను తీసుకొని వచ్చారు. కలెక్టర్ ప్రావీణ్య శాలువాతో సత్కరించి, దళిత బంధు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మొగిలయ్య అనారోగ్య సమస్యల నుంచి త్వరగా కోలుకోవాలని అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం తరఫున ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తమ ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని దళిత బంధు పథకం మంజూరు చేయించిన బోయినపల్లి వినోద్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్ రెడ్డికి మొగిలయ్య దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, ఎల్‌డీఎం రాజు తదితరులు పాల్గొన్నారు. బలగం సినిమాతో వీరి కళ గొప్పతనం అందరికీ తెలిసిన సంగతి తెలిసిందే. ఊరూరా తిరుగుతూ గానం చేసి, వచ్చిన డబ్బుతో వీరు జీవనం సాగిస్తున్నారు. అయితే, ఇటీవల మొగిలయ్య ఆరోగ్యం బాగా క్షీణించి నిమ్స్ ఆస్పత్రిలో కూడా చికిత్స పొందారు. ఆయనకు కిడ్నీ సమస్యలు ఉండడంతో డయాలసిస్ కూడా చేయించుకుం టున్నారు. బుడిగ జంగాల కళాకారుడు పస్తం మొగిలయ్య బలగం సినిమాలో ఆయన పాట తర్వాత బలగం మొగిలయ్యగా పేరు పొందాడు. ఆయన భార్య కొమురమ్మ. కొద్ది రోజుల క్రితం అనారోగ్య కష్టాలు చుట్టుముట్టాయి. మొగిలయ్యకు రెండు కిడ్నీలు పని చేయకపోవడంతో రెండేళ్లుగా డయాలసిస్ చేసుకుంటున్నారు. బలగం సినిమాతో తాను వెలుగులోకి వచ్చినట్లే తనకున్న జబ్బు కూడా బయటి ప్రపంచానికి తెలిసింది. ఆరోగ్యం పూర్తిగా క్షీణించి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆ సమయంలో ఆయన భార్య తమకు సాయం చేయాల్సిందిగా వేడుకున్న వీడియోలు కూడా వచ్చాయి. ఊరూరా తిరుగుతూ యక్షగానాలు, బుర్రకథలు చెపుకుంటూ జీవనం కొనసాగిస్తున్న మొగిలయ్యకు ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోమత లేదు. ఇదే విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం స్పందించి, అతడి కుటుంబానికి అండగా నిలిచింది. ఉన్నతాధికారులతో మాట్లాడి దళిత బంధు పథకం కింద మొగిలయ్యను ఎంపిక చేశారు

ప్రజా తపన
prajathapana.com

# కాసర్ల శ్యామ్, శ్రావణ భార్గవి కాంబోలో ఆకట్టుకుంటోన్న తెలంగాణ జానపద గీతం



అందరితో శభాష్ అనిపించేలా తెలుగు ఒరిజినల్ మ్యూజిక్ వీడియో సాంగ్స్‌ను ఆడియెన్స్‌కు అందిస్తోన్న సంస్థ నివృతి వైబ్స్. అత్యుత్తమమైన ప్రొడక్షన్ వేల్యూస్‌తో ఆడియో, విజువల్ కంటెంట్‌ను అందించటంలో ఎప్పటికప్పుడు తనకు తానే బెస్ట్ అనిపించుకుంటూ ఈ సంస్థ ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. గడిచిన రెండేళ్లలో తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ భాషల్లో నివృతి సంస్థ 50కి పైగా మ్యూజిక్ వీడియో సాంగ్స్‌ను అందించింది. వీటిలో జరీ జరీ పంచెకట్టి.., గుంగులు, సిలక ముక్కుదానా, జంజీరే, వద్దన్నా గుండెల్లో సేరి వంటి పాటలు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్‌ను రాబట్టుకున్నాయి.

ఇప్పుడు నివృతి వైబ్స్ నుంచి మరో తెలంగాణ జానపద పాట మ్యూజిక్ వీడియోగా మన ముందుకు వచ్చింది. 'నా ఫ్రెండ్‌దేమో పెళ్లి..' అంటూ సాగే ఈ పాటలో జయతి ప్రధాన భూమికను పోషించింది. బుల్లి తెరపై వెన్నెల ప్రోగ్రామ్‌తో తిరుగులేని క్రేజ్, ఇమేజ్‌ను దక్కించుకున్న జయతి ఈ సాంగ్‌లో అద్భుతమైన హావ భావాలతో, మూమెంట్స్‌లో కట్టి పడేసింది. ఈ మధ్య కాలంలో విడుదలైన సెన్సేషనల్ పాటలకు సంగీతాన్ని అందిస్తోన్న మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో 'నా ఫ్రెండ్‌దేమో పెళ్లి...' సాంగ్ కు సంగీత సారథ్యాన్ని అందించారు. శ్రావణ భార్గవి అద్భుతంగా పాడిన ఈ పాటకు ప్రాణం పోశారు. భాను మాస్టర్ సాంగ్కి సూపర్బ్‌గా కొరియోగ్రఫీ చేశారు. లిరిసిస్ట్ కాసర్ల శ్యామ్ మరోసారి తన పెన్ పవర్ ఎలా ఉంటుందో చూపించారు. జయతి విజన్స్ సమర్పణలో శ్రీకోనేటి ఈ పాటను డైరెక్ట్ చేశారు.

యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ డిజిటల్ మాధ్యమంలో ఒక బిలియన్ వ్యూస్ ఉన్న ప్లాట్‌ఫామ్స్ నివృతి వైబ్స్ సొంతం. శేఖర్ మాస్టర్, సుద్దాల అశోక్ తేజ, భీమ్స్ సిసిరోలియో, షణ్ముఖ్ జశ్వంత్, మధు ప్రియ, శ్రావణ భార్గవి, దేత్తడి హారిక, లహరి షారి, మానస్, విష్ణు ప్రియ, అనన్య భట్, రాజ్యలక్ష్మి, హారిక నారాయణ్, సాకేత్ కొమందూరి వంటి టాలెంటెడ్ ఆర్టిస్టులు, టెక్నీషియన్స్‌తో నివృతి వైబ్స్ వర్క్ చేసింది.

2024 పూర్తయ్యేసరికి 150 పైచిలుకు మ్యూజిక్ వీడియో సాంగ్స్‌ను అందించటానికి సన్నాహాలు చేస్తున్నట్లు నివృతి వైబ్స్ సంస్థ తెలియజేశారు.

# 'మళ్ళీ పెళ్లి' నుంచి కావేరి గాలిలా పాట విడుదల



నవరస రాయ డా. నరేష్ వి.కె గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్ 'మళ్ళీ పెళ్లి' హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేస్తోంది. యూనిక్ కథతో తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ లో పవిత్ర లోకేష్ కథానాయిక. మెగా మేకర్ ఎంఎస్ రాజు రచన దర్శకత్వం వహిస్తున్నారు. విజయ కృష్ణ మూవీస్ బ్యానర్‌పై నరేష్ స్వయంగా దీనిని నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి.

ఫస్ట్ లుక్, గ్లింప్స్, టీజర్, పాటలు ఇలా ప్రతి ప్రమోషనల్ కంటెంట్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి కావేరి గాలిలా పాటని విడుదల చేశారు. సురేష్ బొబ్బిలి ఈ పాటని మనసుని హత్తుకునే మెలోడియస్ ట్యూన్ గా కంపోజ్ చేశారు. నరేష్ అయ్యర్ ఆలపించిన ఈ పాటకు అనంత శ్రీరామ్ అందించిన సాహిత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ పాటలో నరేష్, పవిత్ర లోకేష్ ల కెమిస్ట్రీ బ్యూటీఫుల్ గా వుంది.

సురేష్ బొబ్బిలి, అరుల్‌దేవ్ కలిసి ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఎంఎన్ బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ, జునైద్ సిద్ధిక్ ఎడిటర్. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, భాస్కర్ ముదావత్ ప్రొడక్షన్ డిజైనర్.

జయసుధ, శరత్‌బాబు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో వనిత విజయకుమార్, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ, భద్రం, యుక్త, ప్రవీణ్ యండమూరి, మధు తదితరులు నటిస్తున్నారు.

మళ్లీ పెళ్లి మే 26న విడుదల కానుంది.

తారాగణం: డాక్టర్ నరేష్ వికె, పవిత్ర లోకేష్, జయసుధ, శరత్ బాబు, వనిత విజయకుమార్, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ, భద్రం, యుక్త, ప్రవీణ్ యండమూరి, మధు తదితరులు

# జూన్ 3న జైపూర్‌లోని లీలా ప్యాలెస్ లో అంగరంగవైభవంగా శర్వానంద్, రక్షితాల వివాహం



హీరో శర్వానంద్, రక్షితా ల వివాహం రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరగనుంది. వివాహ ఆహ్వానం వెలువడింది. ఈ వివాహ వేడుక రెండు రోజులు పాటు వైభవంగా జరగనుంది. మెహందీ ఫంక్షన్ జూన్ 2 న జరుగుతుంది. మరుసటి రోజు పెళ్లి కొడుకు ఫంక్షన్ జరుగుతుంది. అదే రోజు జూన్3న జైపుర్‌లోని లీలా ప్యాలెస్ లో శర్వానంద్, రక్షితా ల వివాహం అంగరంగ వైభవంగా జరగనుంది. వివాహ వేడుక రాత్రి 11 నుండి ప్రారంభమవుతుంది. శర్వానంద్, రక్షితా ల నిశ్చితార్థం జనవరిలో జరిగింది. హైదరాబాద్‌లో జరిగిన వేడుకలో ఇరు కుటుంబసభ్యులు, ప్రముఖుల సమక్షంలో వీళ్లిద్దరూ ఉంగరాలు మార్చుకున్నారు.




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950